



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 41 | శనివారం 5 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ. 6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ప్రభుత్వానికి పది రోజుల సమయం కావాలి

- దేవనహళ్లి రైతుల పోరాటం
- ప్రభుత్వ వైఖరిని ఇప్పుడే ప్రకటించలేము
- జూలై 15న మళ్ళీ సమావేశం
- సీఎం సిద్ధరామయ్య



**బెంగళూరు- సూర్య వాస్తవం, జూలై 4:**


చట్టపరమైన సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వానికి పది రోజుల సమయం కావాలి. ఈ విషయంలో తగిన నిర్ణయం తీసుకొని జూలై 15న రైతు కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలని సీఎం సిద్ధరామయ్య నిర్ణయించారు. దేవనహళ్లి సమీపంలోని చన్నరాయపట్నం హొబ్లీలో వ్యవసాయ భూముల భూసేకరణకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం విధానసౌధ సమావేశ మందిరంలో రైతు కార్యకర్తలు, స్థానిక నాయకులతో

- మిగతా 2లో..

## గడ్డను వీడినా... ఆత్మను వీడలేదు

- ట్రినిడాడ్‌లో ప్రవాస భారతీయులపై మోదీ ప్రశంసలు
- ట్రినిడాడ్‌లో భారత సంతతి ప్రస్థానం ధైర్య సాహసాలతో కూడుకున్నదని వ్యాఖ్య
- దేశాభివృద్ధిలో భారతీయుల పాత్ర ఎంతో కీలకమన్న మోదీ
- ప్రధాని కమలా ప్రసాద్ సహా పలువురు ప్రముఖులను గుర్తు చేసుకున్న వైనం

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్ - సూర్య వాస్తవం, జూలై 4:**



ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వారి పూర్వీకుల జీవిత ప్రస్థానం ధైర్య సాహసాలతో కూడుకున్నదని, వారు ఎదుర్కొన్న కష్టాలు ఎవరినైనా కుంగదీసేవని అన్నారు. అయినా వాటన్నింటినీ ఆశతో, పట్టుదలతో ఎదుర్కొన్నారని కొనియాడారు. "మీ పూర్వీకులు గంగ, యమునలను విడిచిపెట్టినా, తమ హృదయాల్లో రామాయణాన్ని మోసుకొచ్చారు. పుట్టిన గడ్డను వదిలినా, తమ ఆత్మను వదులుకోలేదు" అని మోదీ భావోద్వేగంగా అన్నారు. వారు కేవలం వలసదారులు కాదని, శాశ్వతమైన భారత నాగరికతకు రాయబారులుగా

- మిగతా 2లో..

### ప్రధాని మోడీకి ట్రినిడాడ్, టొబాగో అత్యున్నత పురస్కారం



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ టోబాగో దేశపు అత్యున్నత పౌర పురస్కారం లభించింది. మోడీ ప్రపంచ నాయకత్వం, ప్రవాస భారతీయులతో మోడీకి ఉన్న

- మిగతా 2లో..

## ఆగస్టుకు కొత్త పాస్ పుస్తకాలు

- వారసత్వ భూములకు సక్సెషన్ సర్టిఫికెట్
- రెవెన్యూశాఖపై సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 4:**

భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని భూ యజమానులకు ఆగస్టు నాటికి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని సిఎం చంద్రబాబునాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ శాఖపై రెవెన్యూశాఖ మంత్రి అనగానితో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆధార్‌తో సమగ్ర భూ వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలు, పాలసీలను అనుసరించి కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టుకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రైవేట్ టీమ్‌తో ఆడిటింగ్ చేసినప్పుడే ఒక అంచనా వస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు అనధికారికంగా ఉంటున్న అభ్యంతరం లేని ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అక్టోబరు నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. ఈ ఏడాదిలో 43.89 లక్షల మందికి సర్టిఫికెట్లు అందజేశారని, మిగిలిన వారికి కూడా అందించాలన్నారు. ఒకసారి ధ్రువీకరణ పొందితే వారి కుటుంబసభ్యులకు ఆ డేటా ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రం వచ్చేలా చూడాలన్నారు. ఎస్సిలకు స్మశాన



వాటికల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 363 హేబిటేషన్స్‌కు శ్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలని, ఇందుకు రూ.137కోట్లతో భూ సేకరణ చేయాలని అన్నారు.

**రూ.100 చెల్లిస్తే సక్సెషన్ సర్టిఫికెట్**

వారసత్వంగా వచ్చే భూములను పంచుకునే విషయంలో రూ.100 చెల్లించి సక్సెషన్ (సర్టిఫికెట్) చేసుకోవచ్చని, ఆ భూమి విలువ రూ.10 లక్షలైతే రూ.వెయ్యి చెల్లించి సక్సెషన్ చేసుకోవచ్చని సిఎం వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అవసరమైన అధికారాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

- మిగతా 2లో..




## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- బోస్టన్ గ్రూప్ చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

2లో

## హైస్కూల్ ప్లస్‌లో అధ్యాపకుల నియామకం

- పండగ వాతావరణంలో మెగా పిటిఎం నిర్వహణ
- సమీక్షలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 4:**

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అధ్యాపకుల నియామకంపై చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉన్నత, పాఠశాల విద్యాశాఖలపై ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిఎస్‌సిలో ఎంపికైన టీచర్లకు ఆగస్టు నాటికి నియామక ఉత్తర్వులిచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిఎస్‌సిని అడ్డుకునేందుకు వైసిపికి చెందిన వారు 32 కేసులు వేసినప్పటికీ అధిగమించి విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

- మిగతా 2లో..

## జల్‌జీవన్‌మిషన్‌తో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్
- రూ. 1290 కోట్లతో నరసింహాపురంలో తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన



**మార్కాపురం - సూర్య వాస్తవం, జూలై 4:**

ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కరువు తీవ్రంగా ఉందని, అక్కడి ప్రజలు దాహం తీర్చుకునేందుకు రక్షిత నీరు కూడా అందుబాటులో లేదని, రెండు దశాబ్దాలుగా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంత ప్రజల దాహార్తిని రక్షిత నీటితో తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.1.290 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మార్కాపురం పట్టణ శివారులోని నరసింహాపురంలో తాగునీటి పథకానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తాగునీరు, సాగునీరు లేక పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ఇక్కడి పరిస్థితులపై యువతలోనూ ఆందోళన నెలకొందన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా గత వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రాధాన్యత కలిగిన ప్రాజెకు కోసం రూ. నాలుగు వేల కోట్లు

- మిగతా 2లో..



## విజయవాడ వెస్ట్ బైపాస్‌కు రంగా పేరు పెట్టాలి

- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు షర్మిల కీలక విన్నపం
- వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భంగా షర్మిల నివాళి
- విజయవాడ పశ్చిమ బైపాస్‌కు రంగా పేరు పెట్టాలని డిమాండ్
- గతంలోనే కాంగ్రెస్ పార్టీ ఇదే డిమాండ్‌ను తీసుకొచ్చిందన్న షర్మిల

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ప్రధాని మోడీకి ట్రినిడాడ్, టొబాగో అత్యున్నత పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

లోతైన అనుబంధం, కోవిడ్-19 మహమ్మారి సమయంలో మోడీ చేసిన మానవతా ప్రయత్నాలకు గుర్తింపుగా 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో" అవార్డును ప్రకటిస్తున్నట్లు ఆ దేశ ప్రధాని కమ్లా పెర్సాద్-బిస్సేస్సార్ గురువారం ప్రకటించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా రెండు రోజుల పాటు ఈ దేశంలో మోడీ పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి హోదాలో మోడీ ఈ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి. అలాగే 1999 తరువాత ట్రినిడాడ్, టొబాగోలో ఒక భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

# గడ్డను వీడినా... ఆత్మను వీడలేదు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచారని ప్రధాని ప్రశంసించారు. ట్రినిడాడ్ సాంస్కృతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి భారత సంతతి చేసిన సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ఈ దేశ తొలి మహిళా ప్రధానిగా కమలా ప్రసాద్-బిస్సెసార్, అధ్యక్షురాలిగా క్రిస్టీన్ కార్లా కంగాలూ, రైతుబిడ్డ నుంచి ప్రధానిగా ఎదిగిన బసదేవ్ పాండే వంటి ఎందరో ప్రముఖులను ఆయన గుర్తు చేసుకున్నారు. "గిర్మిటియాల వారసులుగా ఉన్న మీరు ఇప్పుడు మీ విజయాలు, సేవలతో గుర్తింపు పొందారు. బహుశా ఇక్కడి 'డబుల్స్', 'దాల్ పూరీ'లోనే ఏదో మ్యాజిక్ ఉందేమో, ఎందుకంటే మీరు ఈ దేశ విజయాన్ని రెట్టింపు చేశారు" అని మోదీ చమత్కరించారు. భారత్, ట్రినిడాడ్ మధ్య బంధం తరాలు, భౌగోళిక సరిహద్దులకు అతీతమైనదని మోదీ అన్నారు. ఇక్కడి వీధులకు బెనారస్, పాట్నా, కోల్‌కతా వంటి భారత నగరాల పేర్లు ఉండటం, నవ రాత్రి, మహాశివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం ఈ బంధానికి నిదర్శనమని చెప్పారు. ఒకప్పుడు లారా ఆటను ఆస్వాదించామని, ఇప్పుడు సునీల్ నరైన్, నికోలస్ పూరన్ మన యువతలో అదే ఉత్సాహాన్ని నింపుతున్నారని క్రికెట్ బంధాన్ని గుర్తుచేశారు. అంతకు ముందు పోర్ట్ ఆఫ్ స్పెయిన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. ట్రినిడాడ్ ప్రధాని కమలా ప్రసాద్-బిస్సెసార్, కేబినెట్ మంత్రులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో మోదీ ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఉన్నతస్థాయి చర్చలు జరపనున్నారు.

# ప్రభుత్వానికి పది రోజుల సమయం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కె.హెచ్. మునియప్ప, బైరతి సురేష్, ఎమ్మెల్యే బి.ఆర్. పాటిల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షాలిని రజనీష్, నటుడు ప్రకాష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భూసేకరణకు సంబంధించి ఇప్పటికే తుది నోటిఫికేషన్ జారీ చేయబడిందని, ఈ విషయంలో ఉన్న చట్టపరమైన అడ్డంకులను పరిష్కరించడానికి రైతుల సమావేశం మళ్ళీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ విషయంలో చట్టపరమైన సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వానికి పది రోజుల సమయం అవసరమని ఆయన అన్నారు. ఈ విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని, జూలై 15న రైతు కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దేవనహళ్లి తాలూకాలోని చన్నరాయపట్నం హోబ్లిలో భూసేకరణ ప్రక్రియను వదిలివేయడం వల్ల కొన్ని చట్టపరమైన సమస్యలు ఉన్నాయి మరియు వాటిని సరిదిద్దడానికి న్యాయ నిపుణులు మార్గాలను సూచించారు. తుది నోటిఫికేషన్ ఇప్పటికే ఏప్రిల్‌లో ఉన్నందున, దాని సాధకబాధకాలను చర్చించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, 10 రోజులు అవసరం. ఈ కాలంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయానికి రాగలదని ఆయన అన్నారు.

# ఆగస్టుకు కొత్త పాస్ పుస్తకాలు

(మొదటిపేజీ తరువాయి)

అదే విధంగా రీ సర్వే 2.0 కు ఆర్థిక సమస్య రాకుంగా చూడాలని, కేంద్రం ఇచ్చే నిధులను రీ సర్వేకే వినియోగించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూమలు రీ సర్వే జరిగే గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామ, వార్డు సచివాలయాల గ్రామ సర్వేయర్లను యథావిధిగా కొనసాగించాలని సిఎం పేర్కొన్నారు.

**ఇంటి స్థలాల కోసం క్యాబినెట్ సబ్‌కమిటీ**

రాష్ట్రంలో ఇల్లు, ఇంటి స్థలం లేని వాళ్లు ఉండకూడదని, రెండేళ్లలో ఇంటి స్థలం, మరో రెండేళ్లలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇళ్ల స్థలాలకు ఈ ఏడాది కాలంలోనే ఇప్పటి వరకు 99,390 మంది దరఖాస్తు చేశారని, వీరి కోసం 2051 ఎకరాల భూమి అవసరమని చెప్పారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు పట్టణాల్లో 2 సెంట్లు, రూరల్‌లో 3 సెంట్ల కోసం భూసేకరణ చేయాలని, పట్టణాల్లో టిడ్కో ఇళ్లు ఇవ్వాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, హౌసింగ్, మున్సిపల్ శాఖ మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం గ్రాంట్స్ కింద ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు.


# జల్‌జీవన్‌మిషన్‌తో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయిందని విమర్శించారు. తమ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చిందన్నారు. నీటి అవసరాలు తీరినప్పుడే పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మార్కాపురంలో కొందరూ దేవాదాయ భూములను ఆక్రమించారని, గత ప్రభుత్వ అండతో ఇదంతా జరిగిందన్నారు. అలాంటి వారికి తరతరాల అడ్రస్ గల్లంతవుతుందని హెచ్చరించారు. దేవాదాయ శాఖ భూములు, ఇతర భూములను అన్యాక్రాంతం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# పీర్ల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## - నాలుగో పట్టణ ఎస్సై ప్రసాద్



**అనంతపురం క్రైం -సూర్య వాస్తవం, జూలై 4:** పీర్ల పండగ ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని అనంతపురం నాలుగవ పట్టణ ఎస్సై ప్రసాద్ సూచనలు చేశారు. శుక్రవారం నాడు నాలుగో పట్టణ పరిధిలోని చంద్రబాబు నాయుడు కొట్టాలలో పీర్ల పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై కొన్ని సూచనలు చేశారు. ఎలాంటి గొడవలకు, వివాదాలకు పాల్పడకూడదనీ ఆయన తెలియజేశారు. మతపరమైన అంశాలలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు . నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

# హైస్కూల్ ప్లస్‌లో అధ్యాపకుల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాలలకు చేరుకునే క్రమంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి అవసరమైనచోట నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ ప్రాంతాల్లో మారుమూల పాఠశాలలకు మొబైల్ నెట్‌వర్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**డిగ్రీ విద్యార్థులకు భారం తగ్గించాలి**

డిగ్రీ విద్యార్థులకు భారం తగ్గేలా యుజిసి నిబంధనలకు అనుగుణంగా సబ్జెక్టుల ఎంపిక విధానం ఉండాలని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో విద్యార్థులకు, కళాశాలలకు అవకాశం కల్పించాలని తెలిపారు. కళాశాలలు భర్తీచేసే సందర్భంలో విద్యార్థుల అంగీకారాన్ని ఆధార్‌తో అనుసంధానించాలని సూచించారు. గత విద్యాసంవత్సరం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. నిర్ణీత కేలండర్ ప్రకారం అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షలను పూర్తిచేసి సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేయాలని తెలిపారు. ఆర్‌జెయుకెటిల్లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సమర్థవంతంగా యుడైస్ ఎన్‌రోల్‌మెంట్**

ఇంటర్ విద్యలో యుడైస్ ఎన్‌రోల్‌మెంట్‌ను సమర్థవంతంగా చేపట్టాలని ఇంటర్మీడియట్ విద్య సమీక్షలో మంత్రి ఆదేశించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్‌లో గానీ, వృత్తి విద్యా కోర్సుల్లో గానీ తప్పనిసరిగా ప్రవేశం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ విద్యార్థి ఇంట్లో ఉండటానికి వీల్లేదన్నారు. ప్రవేశం ఎక్కడ తీసుకున్నారో పాఠశాల విద్యతో సమన్వయం చేసుకొని ట్రాక్ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో నిరక్షరాస్యులకు అక్షర ఆంధ్ర (ప్రాజెక్టు అఆ) కార్యక్రమాన్ని ఆగస్టు 7 నుంచి ప్రారంభించనున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు.

**3 నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు**

ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని నైపుణ్యాభివృద్ధిశాఖ సమీక్షలో అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా యువత, పరిశ్రమలను అనుసంధానించేలా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సింగిల్ ప్లాట్‌ఫామ్ నైపుణ్యం పోర్టల్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు.

ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమెటిక్‌గా రెజ్యూమ్ సిద్ధమయ్యేలా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ సమీక్షలో ఉన్నత, పాఠశాల విద్య, నైపుణాభివృద్ధి శాఖల కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి, సాంకేతిక విద్య డైరెక్టర్ జి గణేష్‌కుమార్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి కృతికా శుక్లా తదితరులు పాల్గన్నారు.

# వ్యాపారస్తులందరు ఐక్యమత్యంగా మెలగాలి

## - రాయచోటి వ్యాపార సంఘాల నాయకులు



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 4:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వ్యాపారాలు చాలా తక్కువ ఉన్నందున చాలామంది వ్యాపారస్తులు తమ దుకాణాలకు బాడుగలు కూడా కట్టే పరిస్థితిలో లేవని రెడీమేడ్ షాపుల అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణం లోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాయచోటి వ్యాపార సంఘాల ఐక్యవేదిక పై ఆయన మాట్లాడుతూస్థానిక వ్యాపారస్తుల కు సహకరించి ఆన్లైన్ ఉత్పత్తులు తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం జువెలరీ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్షాద్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ వ్యాపా రస్తులంతా



ఐక్యమత్యంగా ఉంటే ఎటువంటి సమస్య వచ్చిన పరిష్కరించుకోవచ్చని షాపింగ్ మాల్స్‌లో వ్యాపారాలు తగ్గించి చిన్న వ్యాపారస్తులకు సహాయ సహకారాలు అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. ఫుట్వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి మాట్లాడుతూ కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న సమయంలో ఏ ఆన్లైన్ కంపెనీ గాని ఏ కార్పొరేట్ సంస్థ గాని సహకరించా లేదని స్థానికంగా ఉన్న వ్యాపారులే సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో, హార్డ్వేర్ పెయింట్ ఎలక్ట్రికల్ ఫర్నిచర్ ఎలక్ట్రానిక్ ఆటోమొబైల్స్ టెక్స్టైల్ ఫ్యాన్సీ స్టోర్స్ టైల్స్ అండ్ గ్రానైట్ ఐరన్ మార్ట్ మొబైల్స్ గ్రసరి టైర్స్ బ్యాటరీస్ టూ వీలర్ షోరూమ్స్ కార్యక్రమ నిర్వాహకులు సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ అమిర్ అలీ ప్రధాన కార్యదర్శి ఆఫ్తాబ్ మొగల్ ఇలియాస్ బేక్ జిలాన్ ప్రవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ అస్లాం తదితర సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# విజయవాడ వెస్ట్ బైపాస్‌కు రంగా పేరు పెట్టాలి

- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు షర్మిల కీలక విన్నపం
- వంగవీటి మోహన రంగా 78వ జయంతి సందర్భంగా షర్మిల నివాళి
- విజయవాడ పశ్చిమ బైపాస్‌కు రంగా పేరు పెట్టాలని డిమాండ్
- గతంలోనే కాంగ్రెస్ పార్టీ ఇదే డిమాండ్‌ను తీసుకొచ్చిందన్న షర్మిల

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 4:**

దివంగత కాంగ్రెస్ నేత వంగవీటి మోహన రంగా పేరును విజయవాడ పశ్చిమ బైపాస్ జాతీయ రహదారికి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగా 78వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయనకు నివాళులర్పించిన ఆమె, ఈ మేరకు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఆమె సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. "పేదల పక్షపాతిగా, వారి అభ్యున్నతే లక్ష్యంగా తుది శ్వాస వరకు పోరాడిన గొప్ప నేత వంగవీటి మోహన రంగా. ఆయన జ్ఞాపకార్థం విజయవాడ బైపాస్‌కు ఆయన పేరు పెట్టాలి" అని షర్మిల కోరారు. కాజ టోల్ గేట్ నుంచి చిన్న అవుటుపల్లి వరకు ఉన్న 47.8 కిలోమీటర్ల ఈ రహదారికి 'వంగవీటి మోహన రంగా జాతీయ రహదారి'గా నామకరణం చేయాలని ఆమె సూచించారు. ఈ డిమాండ్‌ను గతంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిందని, ఇప్పుడు రంగా జయంతి సందర్భంగా మరోసారి గుర్తు చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- బోస్టన్ గ్రూప్ చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

**కాకినాడ - సూర్య వాస్తవం, జూలై 4:**

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడలోని జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవం యూనివర్సిటీ అలూమినీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. అనంతరం ముఖ్యఅతిథి కోట సుబ్రహ్మణ్యం మాట్లాడారు. సాంకేతిక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగుమెంటెడ్ రియాల్టీలపై దృష్టి పెట్టాలన్నారు. స్టార్టప్‌ల కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విశ్వ విద్యాల యాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఎఐ, ఐఒటి, ఇ-మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ, పరిశోధన, సరికొత్త బోధనా పద్ధతులతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ వ్యవస్థాపకత, పరిశ్రమలతో అనుసంధానమైన సిలబస్‌ను రూపొందించడం ద్వారా పట్టభద్రులు ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కొనేలా తయారవుతారని చెప్పారు.. అనంతరం రీసెర్చ్ స్కాలర్లకు పిహెచ్‌డిలు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, విసి సిఎస్ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ, ఒఎస్ డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, జెఎన్‌టియుకె ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## సంపాదకీయం

# సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలా..?



భారత దేశం అంటేనే లౌకిక దేశంగా పేరు. ఇపుడా లౌకిక అనే పదాన్నే తీసెయ్యాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయ్. అలాగని ఇది అందరి నుంచీ కాదు.. ఒక సెక్షన్ నుంచి మాత్రమే ఈ తరహా డిమాండ్ వినవస్తోంది. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలి దత్తాత్రేయ హ్వసబెలే. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఎమర్జెన్సీ సమయంలో ఈ పదాలను కాంగ్రెస్ బలవంతంగా చేర్చిందని, దీనిపై చర్చ జరగాలని దత్తాత్రేయ హ్వసబెలే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ మాస్క్ తొలిగిపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, ఆరెస్సెస్.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయని.. రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు కొనసాగింపుగా ఉపరాష్ట్రపతి ధన్కర్ సైతం ఇదే వాయిస్ వినిపించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, లౌకిక అనే పదాలను జోడించడం సనాతన స్ఫూర్తికి విరుద్ధమని అన్నారాయన.

1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ రాజ్యాంగానికే చీకటి కాలమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సోషలిస్ట్, సెక్యులరిస్ట్ పదాలు ప్రవేశికలో ఉండాలా వద్దా? అనే దానిపై చర్చ జరగాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబెలే చెప్పిన రెండు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఇదో చర్చనీయాంశమైంది. దిగారు. అంతే కాకుండా సనాతన ధర్మానికి విరుద్ధం అన్న కామెంట్లు సైతం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అంశంపై కామెంట్ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అయిన శివరాజ్ సింగ్.. భారతదేశంలో సోషలిజం అవసరం లేదని అన్నారు. లౌకిక వాదం మన సంప్రదాయం కాదని అన్నారు. ఎమర్జెన్సీలో వీటిని చేర్చారనీ.. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో భాగం కానే కాదని అన్నారాయన. భారత్ మే సమాజ్ వాద్ కీ జరూరత్ నహీ హై, ధర్మ నిరపేక్ష్ హమార సంస్కృతి కా మూల్ నహి హై.. ఔర్ ఇస్లీయే పర్ జరూర్ విచార్ హోనా చాహియే.. అన్నారు. దీనర్థమేంటంటే.. భారతదేశంలో ఈ రకమైన పదాలు మనకు అవసరం లేదని అన్నారు చౌహాన్. కాబట్టి, దీనిపై చర్చించాలి అన్నది ఈ వ్యాఖ్యల సారాంశం. ఒకరకంగా చెబితే.. ఇది ఆర్ఎస్ఎస్ పిలుపునకు పరోక్ష మద్దతుగా భావిస్తున్నారు. లౌకిక వాదం మనది కాదన్న అస్సాం సీఎం హిమంత. ఇక ఇదే అంశంపై మరొక నేత కూడా కామెంట్ చేశారు. ఆయనే.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. సోషలిజం, లౌకికవాదం మనవి కావు. పాశ్చాత్య భావనలని, ఈ పదాలకు భారత నాగరికతలో స్థానం లేదని అన్నారు. మీరు కాస్త గట్టిగా ఆలోచిస్తే మన అస్తిత్వ సవాళ్లకే మనం అవకాశమిస్తున్నామని.. ఇదొక చీడ పురుగుగా దేశాన్ని పట్టి పీడిస్తోందని అన్నారు ఉప రాష్ట్రపతి. ఇది వేల సంవత్సరాల నాగరికతను కించ పరుస్తోందని.. ఈ సెక్యులరిజం అన్నది మనదైన సంప్రదాయాన్ని తక్కువ చేసుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు ధన్కర్. ఇది సనాతన ధర్మానికే పూర్తి అవమానకమని కామెంట్ చేశారు ధన్కర్. ఉపరాష్ట్రపతి ధన్కర్ కి రచయిత, మాజీ కర్ణాటక ఎమ్మెల్సీ వీరయ్య రాసిన సంకలనం అంబేద్కర్ సందేశాలు అనే పుస్తకం తొలి కాపీ అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ఈ కామెంట్లు చేశారు.

ఆర్ఎస్ఎస్ అగ్ర నేత నుంచి ఉపరాష్ట్రపతి వరకూ ఈ తరహా కామెంట్లు చేయడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది కాంగ్రెస్. తర్వాత మురుగన్ మానాడు సభలోనూ పవన్ సరిగ్గా ఇలాంటి సెక్యులరిస్టు కామెంట్లు చేశారు. ఇది గత కొంతకాలంగా భారతదేశంలో వినిపిస్తన్న మాట. ఆ మాటకొస్తే మొన్న పూనేకి చెందిన లా స్టూడెంట్ శర్మిష్ట పనోలీ విషయంలోనూ సరిగ్గా ఇలాగే కామెంట్ చేశారు పవన్. దేశంలో సెక్యులరిజం అంటే అది హిందుత్వ వాదులను అనడానికి మాత్రమే పనికొచ్చే ఒకానొక వెసలుబాటు కాదని కామెంట్ చేశారాయన. ఈ ధోరణి వెనక రాజ్యాంగంలోని ఈ సెక్యులరిస్ట్ పదాలే కారణమన్నది వీరందరి వాదనగా తెలుస్తోంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా లౌకిక, సోషలిస్ట్ అనే రెండు పదాలను ప్రవేశికలో చేర్చారు. అత్యవసర పరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేసిన అనేక ఇతర మార్పులను తిప్పికొట్టినప్పటికీ, అది సోషలిస్ట్, సెక్యులరిస్ట్ అనే పదాలను అలాగే ఉంచింది. వాస్తవానికి, 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, నాటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2015లో పార్టీ లైన్‌ను స్పష్టం చేశారు. నేటి పీఠిక అలాగే ఉండాలని బిజెపి విశ్వసిస్తుంది. దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. బేసిగ్గా చూస్తే ఇప్పటి వరకూ భారత్ కి రక్షణ కవచం ఈ లౌకిక వాదమే. పాకిస్థాన్ లా ఒక మత తత్వ దేశంగా భారత్ మారితే.. దాని విస్తృత రూపం రేపటి రోజున మరొక విధంగా మారే అవకాశం లేక పోలేదు. కానీ బీజేపీ చూస్తుంటే భారత్ ని లౌకిక వాదం నుంచి పక్కకు తప్పించేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నట్టే కనిపిస్తోందని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఏం పాకిస్థాన్ మన నుంచి విడిపోయి ఇస్లామిక్ కంట్రీగా మారినపుడు మన దేశం హిందూ దేశం ఎందుకు కాకూడదన్నది రెగ్యులర్ గా సంఘ్ పరివార్ సభ్యులు వేసే ప్రశ్న. వీరి ఆలోచన ప్రకారం భారత దేశం ఇప్పటి వరకూ లౌకిక వాదం, సామ్యవాదం ద్వారా నష్టపోయినట్టుగానే చెప్పాల్సి ఉంటుంది. సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగిస్తే ఏం జరుగుతుంది? ఒక వేళ సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలు తొలిగిస్తే ఏం జరుగుతుంది? అని చూస్తే అది దేశ స్వరూప స్వభావాలను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది. రాజ్యాంగ సూత్రాలు, విలువలు కూడా బొత్తిగా మారిపోయే ఛాన్సుంది. అంతే కాదు సామాజిక, ఆర్థిక సమానత్వం.. మత స్వేచ్ఛ వంటి అంశాలపై ఇది తన తడాఖా చూపించవచ్చని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఒక వేళ సోషలిస్ట్ అనే పదం తొలగిస్తే.. దేశ సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం తయారు చేసిన రాజ్యాంగ లక్ష్యాన్నిది బలహీనపరుస్తుంది. సంపద, వనరుల సమాన పంపిణీ, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తారు కొందరు నిపుణులు. సెక్యులర్ అనే పదం తొలగిస్తే, మతపరమైన స్వేచ్ఛ కూడా కోల్పోయే ప్రమాదముంది. మతం ప్రాతిపదికన వివక్షకు వ్యతిరేకంగా ఉన్న రాజ్యాంగ సూత్రం మరింత ఇరుకున పడుతుంది. ప్రభుత్వం కూడా మతం పరంగా పక్షపాత ధోరణిని అవలంబించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ రెండు పదాల కారణంగా దేశంలో సామాజిక న్యాయం. ఈ రెండు పదాలు రాజ్యాంగ ప్రవేశికలో చేర్చడం ద్వారా, భారత రాజ్యాంగం సమగ్రత, లౌకికవాదం.. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నట్టు కనిపిస్తుంది. వీటిని తొలగిస్తే, రాజ్యాంగ విలువలు మరింత పలుచనయ్యే అవకాశం కనిపిస్తోందని అంటారు రాజ్యాంగనిపుణులు. ఇతర దేశాలు కూడా ఈ మార్పును గమనించి, భారతదేశంతో సంబంధాలు నెరిపే విధానాన్ని మార్చుకోవచ్చు.

ముఖ్యంగా ఇతర దేశాలలో లౌకికవాదం, సామాజిక న్యాయం పట్ల ఆసక్తి ఉన్నవారిలో మన పట్ల ఇప్పటి వరకూ ఉన్న ధోరణి మారవచ్చు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగిస్తే, భారత రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలు, విలువలు దెబ్బతినే అవకాశం ఉంది. సామాజిక- ఆర్థిక- సమానత్వం- మతపరమైన స్వేచ్ఛ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం చూపేలా తెలుస్తోంది. అందుకే రాహుల్, దత్తాత్రేయ అన్న వెంటనే తీవ్రంగారియాక్టయ్యారు.

# సుపరిపాలనలో పవన్ ఎక్కడ


**విజయవాడ - సూర్య వాస్తవం**



జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏడాది గడుస్తున్నా ఇంత వరకూ తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కాలేదు. జనసేన ఆవిర్భావ సభలో వారిని వేదికపై కలవడమే తప్పించి అడపా దడపా అప్పుడప్పుడు వేర్వేరుగా కలుస్తున్నారు తప్పించి పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై కూడా ఫీడ్ బ్యాక్ తీసుకునే ప్రయత్నం చేయకపోవడం ఇప్పుడు జనసేనలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు వరసగా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమవుతూ వారికి కార్యక్రమాలను ఇస్తూ క్షేత్రస్థాయిలో యాక్టివ్ చేస్తుంటే పవన్ కల్యాణ్ మాత్రం ఆ పనికి పూనుకోకపోవడాన్ని కొందరు నేతలే ప్రశ్నిస్తున్నారు. 2024 లో జరిగిన ఎన్నికల్లో జనసేన హండ్రెడ్ పర్సెంట్ సక్సెస్ రేట్ సాధించింది. 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే అనేక చోట్ల తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జులతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల వారి మాటలను అధికారులు కూడా వినడం లేదన్న వార్తలు వస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులను కూడా తమ ప్రమేయం లేకుండా టీడీపీ నేతలు భర్తీ చేసుకుంటున్నారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేల నుంచి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకుని వాటిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత పవన్ కల్యాణ్ పైనే ఉంది. . కానీ పవన్ కల్యాణ్ మాత్రం నిత్యం బిజీగానే ఉంటున్నారు. తాను ఒక పార్టీ చీఫ్ అన్న విషయాన్ని మర్చిపోయి ఎమ్మెల్యేలతో టచ్ మి నాట్ గా వ్యవహరిస్తే జరుగుతున్న విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నిస్తున్నారు. కేవలం కొందరు ఇచ్చే ఫీడ్ బ్యాక్ తోనే జనసేనాని ముందుకు వెళితే భవిష్యత్ లో రాజకీయంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మూడు గంటల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడే తీరిక లేని పవన్ కల్యాణ్ ఇక రాజకీయాలు ఏం చేస్తారని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని కోరుతున్నారు

# కొత్త స్ట్రాటజీలో వైఎస్ జగన్

**విజయవాడ**



వైసీపీ అధినేత వైఎస్ జగన్ వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావడంతో ఇక జనంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే కొత్త నేతలకు కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని ఇక పార్టీలోకి తిరిగి తీసుకోకుండా వారి స్థానంలో యువనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నిన్న జరిగిన పార్టీ యువజన విభాగం నేతలతో జరిగిన సమావేశంలో మంచి నేతలను గుర్తించి పార్టీలోకి తీసుకు రావాలని అనడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఇప్పటి వరకూ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.వైసీపీ ఖచ్చితంగా ఈ సారి అధికారంలోకి వస్తుందని భావిస్తున్న జగన్ అందుకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యువజన విభాగాన్ని పటిష్టం చేయడంతో పాటు పార్టీ అనుబంధ విభాగాలను కూడా మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కేసులకు భయపడి వెనుకంజ వేయవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని భరోసా ఇస్తూ ఇక ఎఫెన్స్ లో వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. అందుకే యువకులతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా బలోపేతం చేయడంతో పాటు మహిళ విభాగాన్ని కూడా మరింతగా శక్తిమంతం చేసి అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేయాలన్న యోచనలో ఉన్నారు.. త్వరలోనే వైఎస్ జగన్ వైసీపీ విద్యార్థి విభాగం, మహిళ విభాగం నేతలతో కూడా సమావేశం అయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరొక వైపు జగన్ తాను స్వయంగా సమస్యలపై జిల్లాలను పర్యటిస్తూ పార్టీకి మరింత హైప్ తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఏ వర్గాన్ని దూరం చేసుకోకుండా దగ్గరకు తీసుకునే యత్నంలోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. గుంటూరులో మిర్చిరైతులు, పొదిలిలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం వెళ్లి వారితో మాట్లాడిన జగన్ తాజాగా ఈనెల 9న చిత్తూరు జిల్లా మామిడి రైతులతో కూడా సమావేశం కానున్నారు. ఇలా జిల్లా పర్యటనలతో పాటు మరొకవైపు పార్టీ అనుబంధ విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ ను కూడా బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా బెదరకుండా పనిచేసిన వారికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వస్తున్నారు. వైసీపీకి సోషల్ మీడియా బలం ఎక్కువ అన్న నేపథ్యంలో ఇటీవల అక్రమ కేసులతో కొంత వెనకబడి ఉండటాన్ని గమనించిన జగన్ ఆ దిశగా వారికి ధైర్యాన్ని కల్పించి, కేసులు వస్తే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. మొత్తం మీద పార్టీ నేతలపై జగన్ ఆధారపడకుండా ఇక అనుబంధ విభాగాలను బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది.

# ల్యాండ్ పూలింగ్.. కండిషన్స్ అప్లై...

**విజయవాడ, - సూర్య వాస్తవం**

ఏపీ రాజధాని అమరావతి కోసం కొత్తగా చేపట్టనున్న భూ సమీకరణకు నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాజధాని అభివృద్ధికి సీఆర్డిఏ పరిధిలో చేయనున్న భూ సమీకరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ (రూపకల్పన, అమలు) నిబంధనలు 2025 గెజిట్లో నిబంధనలను నోటిఫై చేస్తూ ఏపీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జిఓ నంబర్ 118 జారీ చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని 217 చదరపు కిలోమీటర్లు మినహా సి ఆర్ డి ఏ మొత్తం ప్రాంతానికి ఈ నిబంధనలు వర్తిస్తాయి. 2014లో అమరావతికి ప్రకటించిన నిబంధనలను దాదాపుగా తాజా భూసేకరణకు వర్తింపజేస్తున్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, అన్ని ఇతర అవసరమైన ప్రాజెక్టుల వంటి అవసరమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించడానికి, భూమి సేకరణ విధానం స్వచ్ఛంద పథకంగా రూపొందించారు. ఇది భూ యజమానులు, రాష్ట్రం/అధికార సంస్థ మధ్య పరస్పర ఏకాభిప్రాయం ఆధారంగా ఉంటుంది. ఇది భూమి సేకరణకు ఒక ప్రత్యేకమైన పద్ధతి 'ల్యాండ్ పూలింగ్ పథకం' అమలు చేస్తారు.ల్యాండ్ పూలింగ్ పథకం అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ రూపొందించిన పథకం, భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 107 ఽ 108 కింద అనుమతి కారణంగా. ల్యాండ్ పూలింగ్ పథకంలో పాల్గొనే భూ యజమానులు అప్పగించిన కారణంగా, ంఖ అఖీఆం చట్టం, 2014లోని సెక్షన్ 48(1) కింద రాష్ట్రం/అధికారికి ప్రాతినిధ్యం వహించే కాంపిటెంట్ అథారిటీ ఇచ్చిన అంగీకారంతో అందించిన భూమిలోని టైటిల్ రాష్ట్రం/అధికారానికి అనుకూలంగా బదిలీ కానుంది. ంఖ అఖీఆం చట్టం, 2014లోని సెక్షన్ 43(4)(జీ) కింద అంగీకరించిన అభివృద్ధి పథకం ప్రకారం, పునర్నిర్మించిన ప్లాట్‌ను అదే ప్రాంతంలో లేదా ఏదైనా ఇతర సమీపంలో భూమి యజమానికి అనుకూలంగా కేటాయించనున్నారు. చట్టంలోని సెక్షన్ 43(5) ఽ (6) ప్రకారం ల్యాండ్ పూలింగ్ పథకం కోసం ఏదైనా ప్రాంతం ఉద్దేశ్యాన్ని ప్రభుత్వమే గుర్తించి తెలియజేస్తే, అథారిటీ ఆమోదం అవసరం లేదు.కమిషనర్ ల్యాండ్ పూలింగ్ పథకాన్ని కొనసాగించడానికి అథారిటీని గుర్తించి ఆమోదం పొందిన



తర్వాత, కమిషనర్/ అధికారి చట్టంలోని సెక్షన్ 55(4) కింద తన ఉద్దేశ్యాన్ని ప్రకటించడానికి నోటిఫికేషన్ ఎలో సూచించిన ఫార్మాట్‌లో సెక్షన్ 55(5) కింద అభ్యంతరాలను ఆహ్వానించారు.

- పురపాలక శాఖ పట్టా భూములు మెట్ట భూములైతే అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఎకరానికి 1000 గజాల నివాస స్థలంతో పాటు 250 గజాల కమర్షియల్ ప్లాట్ ఇస్తారు.
- జామ, నిమ్మ, సపోటా వంటి పండ్ల తోటలున్న భూములకు లక్ష రూపాయలు చొప్పున కేవలం ఒక్కసారి పరిహారం చెల్లిస్తారు.
- జరీబు భూములు ఇచ్చే వారికి ఎకరానికి 1000 చదరపు గజాల నివాసం స్థలంతో పాటు 450 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ స్థలం

ఎసైన్డ్ భూములకు, శివాయ్ జమేదార్స్, అభ్యంతరం లేని, అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్న వారికి కేటగిరీల వారీగా వేర్వేరు ప్యాకేజీలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

- ఒకవేళ పట్టా భూములు 1954 కి ముందు, ఆ తర్వాత ఎసైన్ చేసిన భూములు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితుల భూములకు మాత్రమే కౌలు చెల్లిస్తారు. మిగతా కేటగిరీల భూములకు ఎలాంటి కౌలు చెల్లించరు.
- మెట్ట భూములకు తొలి ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు, జరీబు భూములకు రూ.50 వేల చొప్పున కౌలు చెల్లిస్తారు. రెండో ఏడాది నుంచి ముందు ఏడాది ఇచ్చిన దాంట్లో ఏటా 10 శాతం అధికంగా చెల్లిస్తారు.

అనధికారిక లేఅవుట్లలోని స్థలాలకు 65 శాతం పరిహారం గానీ, గరిష్టంగా 500 చదరపు గజాల భూమి గానీ పరిహారంగా ఇస్తారు. సీఆర్‌డీఏ/డీటీసీపీ లేదా వీజీటీఎం-ఉడా అనుమతితో వేసిన లేఅవుట్లతో పాటు గ్రామకంఠం, అగ్రహారం, అబాది, విలేజ్ సైట్‌లను తాజా భూ సేకరణ నుంచి మినహాయిస్తారు. బలహీనవర్గాల కోసం ఇళ్లు నిర్మించిన కాలనీలను, విస్తరించిన గ్రామ కంఠాలను మినహాయిస్తారు. అయితే భూసమీకరణ నిర్ణయం ప్రకటించే నాటికి ఉన్నవాటినే పరిగణనలోకి తీసుకుంటారు. భూములు తీసుకునే గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు, భూమి లేని నిరుపేదలకు నెలకు రూ.5 వేల చొప్పున 10 సంవత్సరాల పాటు పింఛను ఇస్తారు.


## సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**- జాయింట్ కలెక్టర్ శివ నారాయణన్ శర్మ**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 4:** సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చెన్నైకు చెందిన ఫ్రీడమ్ ట్రస్ట్ సంస్థ అధినేత డాక్టర్ సుందర్, ట్రస్ట్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, సేవేక్స్ టెక్నాలజీస్ సంస్థ అధినేత లతాజోషి, ముంబై వారి సౌజన్య సహకారాలతో అర్హులుగా గుర్తించిన 195 మందికి సుమారు రూ .25 లక్షల విలువ కలిగిన కృత్రిమ కాళ్లు, చేతి కర్రలు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది నిరుపేదలు వివిధ కారణాలతో విభిన్న ప్రతిభావంతులు గా ఉంటారని అలాంటి వారిని ప్రస్తుత దాతలు మానవతా విలువలతో సేవా దృక్పథంతో ఒక్కొక్క కృత్రిమ కాలు ఖరీదు రూ. 12,000 కలిగిన వాటిని ఉదారభావంగా ఉచితంగా అందజేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని, సాటి మనుషుల కష్టాలను గుర్తించి వారిని తమవంతుగా ఆదుకున్నప్పుడే జీవితానికి ఒక సార్ధకత లభిస్తుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఇలాంటి సేవ తత్పరత కలిగిన వారిని ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు పెంపొందించుకోవలసిన అవసరం ఉందని అన్నారు. అనేక ప్రాంతాలలో ఎటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు దాతలను జాయింట్ కలెక్టర్ అభినందించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు ఉచిత కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోలా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, విభిన్న ప్రతిభావంతుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రక్షిత త్రాగునీటి కేంద్రం పునఃప్రారంభం



**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 4:** రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి మండలం కనగానపల్లి గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్షిత త్రాగునీటి కేంద్రంను రూ. 3.50 లక్షల నిధులతో మరమ్మతులు చేయించి పునః ప్రారంభించామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ముందుగా టిడిపి నాయకులు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైంది అని అన్నారు. ప్రజల అవసరాలు తీర్చుతూ ప్రజాసేవలో పరిటాల కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పింఛన్లు సరే
## మిగతా స్కీమ్‌లను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

**- హరిత దివ్యాంగులసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్**



**పామిడి - సూర్య వాస్తవం, జూలై 4:** పామిడి మండల కేంద్రంలో ఖాదర్ పేట గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్ ఆవరణంలో హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, బి.మోహన్ నాయక్ దివ్యాంగులతో కలిసి సమావేశ నిర్వహించారు. బి.మోహన్ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధాకారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఒక్క పింఛన్లు మాత్రమే అందిస్తూందని మిగతా స్కీమ్స్, హౌసింగ్, ట్రైసైకిల్స్, 4వీలర్ బైక్స్, ఉపాధి, ఉద్యోగాలు, ఏమీ అందించడం లేదని సొంత ఇల్లు లేక దివ్యాంగులు బాడగ ఇంట్లో ఉంటూ బడాగ, కట్టలేక, ఉపాధి, లేక ఉద్యోగాలు లేక జీవనం కొనసాగించడం చాలా కష్టంగా ఉందని, కూటమి ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ పథకాలు హౌసింగ్, 4 వీలర్, బైక్స్, ట్రై సైకిళ్ళు, వెంటనే అందిస్తే దివ్యాంగులు ఏదో పని చేసుకుని జీవనం సాగిస్తారని తెలిపారు. ఆర్‌డిటీ గతంలో ఎన్నో రకాల సహాయం చేస్తుండేదని, ఫండ్స్ ఆగిపోయినందు వల్ల దివ్యాంగులకు అందే సహాయం ఆగిపోయిందని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ఇచ్చేలోన్స్‌ను ఘూరిటి లేకుండా ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో రమేష్, అంజి, భాస్కర్, రాజు, రాజశేఖర్ యాదవ్, మణికంఠ, గోపినాథ్, శంకర్, చంటి, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బడికి పోవాలంటే భయం..భయం

**- కోతుల బెడదతో బెంబేలెత్తుతున్న స్కూల్ పిల్లలు - పట్టించుకోని అధికారులు...!**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 4:** అనంతపురం పట్టణంలోని స్థానిక సాయి నగర్ మొదటి క్రాస్‌లో పాఠశాలకు కోతుల బెడద ఎక్కువైంది. ఎంతగా అంటే విద్యార్థులు బయట తిరగాలంటే భయపడేంతగా. ఒకవేళ ఎవరైనా పిల్లలు కనిపిస్తే మర్కటాల దాడి తప్పదు అన్నట్టుగా ఉంది. కోతులు విపరీతమై గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాఠశాల పిల్లలను, ప్రజలను బెదిరిస్తూ గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి. స్థానిక రామన్ స్కూల్ పరిసరాల్లో ఒక గుంపు ఏకంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. కోతులు తరగతి గదుల్లోకి ప్రవేశించి, ఆహారం కోసం వెతుకుతూ, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు పాఠశాలకు రావడానికి భయపడుతున్నారు. దీంతో రోజువారీ బడికి వెళ్లాలంటే భయం భయంగా వెళుతున్నారనీ తల్లిదండ్రులు వాపోతున్నారు. కోతులు పిల్లలపై, పెద్దల పై, వృద్ధుల పై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ కు ఈ విషయం తెలిసిన ఉపయోగమేమీ లేదని అక్కడి స్థానికులు వాదన. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, పాలకులు స్పందించి కోతులను పట్టించి అడవుల్లోకి తరలించాలని పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే సునీత



**రాప్తాడు - సూర్య వాస్తవం, జూలై 4:** ఏడాది కాలంలో తాము చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలకు ఇది తొలి అడుగు మాత్రమే రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి సంక్షేమం చూస్తారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలంలోని ముక్తాపురం గ్రామంలో ఎస్సీ బీసీ కాలనీలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్బంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గ్రామంలో మొత్తం 98శాతం మంది కూటమి పాలన చాలా బాగుందని మెచ్చుకున్నారు ఒకరిద్దరు మాత్రం ఫర్వాలేదు అని చెప్పారు. దీనికి గల కారణాలను కూడా ఎమ్మెల్యే సునీత తెలుసుకున్నారు. తమకు గత ప్రభుత్వంలో పింఛన్లు రేషన్ కార్డులు తొలగించారు. అందువలన సంక్షేమ పథకాలు రావడం లేదన్నారు. ఇది వైసీపీ నాయకులు కక్షతో చేసిన నిర్వాకం అని త్వరలోనే మీకు రేషన్ కార్డులతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత టీడీపీ హయాంలోనే నిర్మించిన మోడల్ కాలనీని సందర్శించారు. ఆ రోజు మీరు ఇచ్చిన ఇళ్ల వలన తాము ఎంతో సంతోషంగా ఉన్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మోడల్ కాలనీ సందర్శించాలని గుర్తు చేశారు. ఈ నిర్మాణాలను చూసి దీనిని రోల్ మోడల్ గా తీసుకోవాలని గృహ నిర్మాణశాఖకు ఆదేశిలిచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాది కాలంలో అనేక హామీలు నెరవేర్చాము. ఇందులో తల్లికి వందనం పింఛన్ల పెంపు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు మెగా డీఎస్సీ అన్న క్యాంటీన్లు ప్రారంభం వంటివి ఉన్నాయన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు 20వేలు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి పథకాలు కూడా ప్రారంభమవుతాయి అని తెలియజేశారు. తాము అంతా చేశామని చెప్పుకోవడానికి రాలేదు. ఇప్పటి వరకు అందించిన వాటి గురించి చెబుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి వచ్చామన్నారు. చాలా మంది ఇళ్ల స్థలాల గురించి అడిగారు త్వరలోనే గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి 3 సెంట్లతో ఇంటి స్థలంతో పాటు పక్కా ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామని చెప్పారు. గ్రామంలో నాగులకట్ట నిర్మాణం కాలనీలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటివి తన దృష్టికి తీసుకొచ్చారు. వాటిని కూడా పరిష్కరిస్తామని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ నాయకుల వర్ధంతి



**గుత్తి - సూర్య వాస్తవం, జూలై 4:** గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్ష నర్ల భవనంలో మన్యం విప్లవ వీ రుడు అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి, స్వామి వివేకా నంద 123 వ వర్ధంతి, జాతీయ పతాక రూపు కర్త పింగళి వెంకయ్య 62 వ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబూబాకర్, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు నేతృత్వం వహించారు. ముగ్గురు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయి బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వక్తలు, జీవితాలను స్మరించుకున్నారు. అల్లూరి సీతారామరాజు తూర్పు గోదావరి జిల్లా రాజోలు సమీపంలోని మోగల్తూరులో 1897లో జన్మించారు. బ్రిటిష్ ప్రభుత్వం అరణ్య చట్టాల ద్వారా ఆదివాసీల హక్కులను హరిస్తుండటంతో, రంపచోడవరం, మన్యం ప్రాంతాల్లో ఆయుధ పోరాటానికి శ్రీకారం చుట్టారు. తక్కువ వయసులోనే సాయుధ విప్లవం చేపట్టి బ్రిటిష్ అధికారులను గడగడలాడించిన వీరయోధుడు. 1924 లో బ్రిటిష్ సైన్యం అతన్ని అరెస్ట్ చేసి ఉరిశిక్ష వేసింది. స్వామి వివేకానంద (1863 - 1902) భారత తత్వశాస్త్ర, ధర్మవేత్త. 1893 లో అమెరికాలోని షికాగోలో జరిగిన ప్రపంచ పరిషత్ నందు హిందూ ధర్మాన్ని గొప్పగా చాటి చెప్పి, దేశ గౌరవాన్ని అంతర్జాతీ యంగా పెంచిన మహనీయుడు. యువతలో జ్ఞానం, ధైర్యం, సేవ భావనకు ప్రేరణగా నిలిచిన ఆధ్యాత్మిక నాయకుడు. పింగళి వెంకయ్య (1876 - 1963) మచిలీ పట్నం సమీపంలోని భట్లపేనుమర్రు గ్రామం. జాతీయపతాక రూప కర్తగా ఆయన చిరస్థాయిగా గుర్తింపు పొందారు. వందేమాతరం ఉద్యమం, హోంరూల్ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని దేశభక్తిని చాటారు. భారతదేశాని కోక జెండా అనే పుస్తకం రచించిన వెంక య్య, దేశానికి గుర్తింపు ఇచ్చే ము వ్వన్నెల జెండాను రూపొందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఈ ముగ్గురు మహనీ యులు తాము జీవించిన కాలా న్ని మించిన ప్రభావాన్ని దేశ చరిత్రపై చూపారు. వారి ఆశయాలను గుర్తుంచుకుని, కొత్త తరం వారికి స్ఫూర్తిగా నిలిపే విధంగా వారి జీవితాలను తెలుసుకోవాలి అని పేర్కొన్నారు. అసోసియేషన్ నేతలు అబూబాకర్, స్వర్ణాంబ, కుల్లాయి బాబులతో పాటు సభ్యులైన షైక్షావలి, విజయలక్ష్మి, వెంకటేష్, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, గోవిందప్ప, నారాయణశెట్టి, శామ్యూల్, దేవదాస్ పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వం వైయస్సార్ అండ్ ఆర్కిటెక్

# యూనివర్సిటీపై కపట ప్రేమ మానుకోవాలి

**- యూనివర్సిటీ విద్యార్థులకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇప్పించాలి**

**- వైసీపీ విద్యార్థి విభాగ అధ్యక్షులు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి డిమాండ్**



**చెన్నూరు - సూర్య వాస్తవం, జూలై 4:** వైఎస్ఆర్ అండ్ ఆర్కిటెక్ యూనివర్సిటీ పై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ మానుకోవాలని వైఎస్ఆర్సిపి కమలాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో పరిధిలో గల వైయస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ, వైయస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీలో 500 మంది విద్యార్థులతో 13 డిపార్ట్మెంట్ లతో ఉన్నదని అయితే ఆర్కిటెక్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని ఇది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినదని విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దని ఆయనక హితవు పలికారు. 2020, 21, 22 విద్యా సంవత్సరానికి సంబంధించిన సి ఓ ఏ కౌన్సిల్ అఫ్ ఆర్కిటెక్ పరిమిషన్ ఇవ్వవలసి ఉందని, పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి అవుతున్న ఇంకా పర్మిషన్ లేకపోవడం పై విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటే యూనివర్సిటీ అధికారులు ,ఉన్నత అధికారులు అదిగో ఇదిగో అంటూ మోసం చేస్తూనే ఉన్నారని ఇది సరైన పద్ధతి కాదని అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. పైగా ప్రభుత్వం యూనివర్సిటీ బిల్డింగులకు రెంటు కడుతుంటే వైస్ ఛాన్సలర్ కాంట్రాక్టర్ కి మధ్య విభేదాల కారణంగా విద్యార్థులను ఇబ్బంది పెడుతూ హాస్టల్ లేకుండా వికెట్ చేయమని ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా చేయడం దారుణమని తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్క విద్యార్థితో కాషన్ డిపాజిట్ కింద 12 వేల రూపాయలు కట్టించుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ విధంగా వ్యవహరించడం సరైనటువంటి పద్ధతి కాదని ఆయన అన్నారు. ఇక్కడ అధ్యాపకులు కూడా మే నెల 21 వచ్చేది వరకు వారి బోధిత సమయం పూర్తయి రెన్యువల్ లేని కారణంగా అధ్యాపకులు బోధించకుండా ఉన్నారని తెలిపారు ఇలాంటి సందర్భంలో ఐదవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ వర్క్, పరీక్షలకు ఎలా వెళ్తారని ఆయన అధికారులన్నీ ప్రశ్నించారు, ఈ క్రమంలోనే ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఆన్లైన్ క్లాసులను చెప్పి ఇంటికి పంపించడం జరిగిందన్నారు, మరి కొంతమంది విద్యార్థులను ఫీల్డ్ వర్క్ అని పంపించేశారని ఉన్న విద్యార్థులకు బోధనను బోధించకుండా వ్యవహరిస్తున్నారని ఆయన తెలియజేశారు, పైగా ఆర్ట్ అండ్ డిజైన్ ( ఏడి ) ఏప్రిల్ లో ఇవ్వవలసిన సెట్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆలస్యం చేస్తూ ఉన్నారని, వైయస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీ పై అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని లోతుగా సమగ్ర విచారణ చేపట్టాలని, ఈ విషయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని లేకపోతే పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ ఎర్ర సాని నిరంజన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల రైతు సంఘం ఉపాధ్యక్షులు, రెడ్డి శేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్‌లో ఉచిత దంత వైద్య శిబిరం



**పామిడి - సూర్య వాస్తవం, జూలై 4:** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల) లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రఖ్యాత్ డెంటల్ హాస్పిటల్ సాయి నగర్ సౌజన్యంతో ఈనెల 6న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, అధ్యక్షుడు కే.రఘువీర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ దంత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ దంత వైద్య శిబిరం నందు అన్ని రకముల దంత సమస్యలు చిగుళ్ల సమస్యలు దీర్ఘకాలిక దంత సమస్యలు ఉచితంగా పరీక్షించబడును. శిబిరంలో దంత పరీక్ష అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయబడును. ఈ అవకాశాన్ని పామిడి మండల మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## శిథిలా వ్యవస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్ మరమ్మతులు

- వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నాశరికమైన పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పైన వెంటనే చర్యలు తీసుకోవాలి
- సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించిన ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు వి.వినోద్



**పామిడి - సూర్య వాస్తవం, జులై 4:** పామిడి మండలం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలంలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ హాస్టల్ ను పరిశీలించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు వి.వినోద్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టల్ మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం దాదాపుగా 19 లక్షల రూపాయలు కేటాయిస్తే ఇక్కడ చూస్తే రంగులతో అలంకరించి మేకప్ చేసి లాగా గత రెండు నెలలుగా వర్క్ చేస్తూ ఇప్పుడు పూర్తి అవ్వడం చూసుకుంటా ఉంటే రెండు నెలలకే సిమెంట్ ఫ్లోరింగ్ అంతా కూడా సీల్ పోయి కాంపౌండ్ వాళ్ళు సగం లో నిలబెట్టేసి హాస్టల్ లో ఇంత దుర్మానంగా చేస్తే జిల్లా అధికారులుకు దున్నపోతు మీద వాన కురిసినట్లు ఉంది అదే విధంగా దాదాపుగా మూడు సంవత్సరాల నుండి వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నాసరికమైన పనులు చేసి వదిలేసిన కాంట్రాక్టు పైన కూడా వెంటనే చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఇప్పుడు ఎవరికైతే కూటమి ప్రభుత్వం 19 లక్షల రూపాయలు విడుదల చేసి మరమ్మతుల్లో అన్ని అయ్యేవిధంగా చూడమని ఇచ్చినటువంటి కాంట్రాక్టర్ పైన కూడా వెంటనే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పామిడి మండలంలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ వసతి గృవాన్ని జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అధికారులు వచ్చిపరిశీలించాలని తెలియజేస్తున్నాము. లేని పక్షంలోనూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకి శ్రీకారం చుడుతామని, అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్‌గా డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పామిడి మండల నాయకులు ఫయాజ్, ఆసిఫ్, సల్మాన్, హర్షిత్, నరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

## నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జులై 04:** అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం సాయంత్రం జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డిఎల్సి, డిఎల్ఎన్సి సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్‌ని, 22ఏ భూములను తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతివారం ఒక మండలం నుంచి ఒక డాటెడ్ ల్యాండ్స్, ఒక 22ఏ కేసులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో 22ఏకు సంబంధించి 19 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, అందులో 4 ఆమోదించగా, 13 తిరస్కరించగా, 2 దరఖాస్తులను పునః పరిశీలించాలన్నారు. డాటెడ్ ల్యాండ్స్ కి సంబంధించి 1 క్లెయిమ్స్ ని విచారించడం జరగగా, ఆ కేసుని పునః పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కందులు పంపిణీ



**రాప్తాడు - సూర్య వాస్తవం, జులై 4:** రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం నసనకోట గ్రామంలో రైతులకు ఎల్ఆర్జి 52 105 రకం విత్తన కందులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్యాయత్నం



**మదనపల్లె - సూర్య వాస్తవం, జులై 4:** కుటుంబ కలహాల కారణంగా ఓ రైతు విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బడికాయలపల్లెకు చెందిన రైతు నరసింహులు కుమారుడు టి మల్లప్ప (47) కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురైయ్యాడు. టమోటా చెట్లు కు కొట్టడానికి తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి, వెంటనే బాధితున్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో డాక్టర్ల సలహా మేరకుబాదిత రైతును తిరుపతి రుయాకు తీసుకు వెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

# మన్యం వీరుడు అల్లూరి జయంతి వేడుకలు


- అల్లూరి సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి, సంగ్రామ భేరి - అల్లూరి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- హాజరైన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎంపీ అంబికా, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 4:** అల్లూరి సీతారామరాజు అన్నది ఒక పేరు కాదని అది ఒక సమూహ శక్తి, స్వతంత్ర సంగ్రామ భేరి అని అనంతపురం నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్లోని రెవెన్యూ భవన్ లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మన్యం వీరుడు అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే దగ్గుపాటి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో స్వతంత్రోద్యమం ఎగసిపడుతుంటే తెలుగు రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా అడవుల్లో అగ్నికణంలా అల్లూరి సీతారామరాజు పుట్టారని అన్నారు. తెల్లవారి బానిస సంకెళ్లకు వ్యతిరేకంగా మొదట పోరాటం చేసిన వీరుడు సీతారామరాజు అన్నారు. మన్యం ప్రాంతంలో గిరిజనులు సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వం పై తిరుగుబాటు చేశారన్నారు. కొన్నేళ్లపాటు సమరశీల ఉద్యమాలకు అల్లూరు సీతారామరాజు నాయకత్వం వహించి.. స్వతంత్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయలేదన్నారు. తెల్లవాడి తుపాకీ గుళ్లకు రొమ్ము విరిచి ఎదురు నిలబడి ప్రాణ త్యాగం చేసి స్వతంత్ర ఉద్యమ జ్వాలలను రగిలించి వెళ్లారన్నారు. ఆ మన్యం వీరుని స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఎంపీ నిధుల్లో 25 లక్షల రూపాయలు కచ్చితంగా వారికి ఖర్చు పెట్టేలా ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బుక్కరాయసముద్రంలో నాలుగు కోట్లతో గురుకుల పాఠశాల నిర్మించామన్నారు. మున్సిపాలిటీలో ఎస్టీలకు ఏడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారని. ఇది వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గురుకుల పాఠశాలలో సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారని.. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సీట్లు పెంచేలా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మలోల, కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నురప్ప, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, దాదా ఖలందర్, బండి కాశీ విశ్వనాథ్, ఈడిగ నాగభూషణం, వేలూరు మారుతి నాయుడు, డాక్టర్ హరి, మనోహర్, రామకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలి

- శాంతి భద్రతలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలి
- అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ



**అనంతపురం క్రైం - సూర్యవాస్తవం, జులై 04:** మతసామరస్యానికి అతీతంగా గూగూడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతోందని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం సింగనమల నియోజకవర్గం, నార్పల మండలం, గూగూడు కుళ్లయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంజనేయస్వామి వారిని మరియు కుళ్లాయ స్వామిని ఎంపీ దర్శించుకోవడం జరిగింది. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాబోవు రెండు, మూడు రోజుల్లో భక్తులు సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నందువలన పోలీస్ డిపార్టుమెంటు వారు జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతి భద్రతలపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. భక్తులకు క్యూలైన్లో ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలన్నారు. భక్తులకు తగినభద్రత కల్పించి చక్కటి దర్శనాన్ని కల్పించాలని డిఎస్పికి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. క్యూలైన్ లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బాధ్యత తీసుకోవాలని, సమస్యలు లేకుండా చూడాలని ఆలయ ఈవోకి తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపుని సందర్శించి దేవుడు దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా అవసరమైనటువంటి మందులను అందుబాటులో ఉంచాలని సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. గూగూడులో పార్లమెంట్ నిధులతో ఏర్పాటు చేస్తున్న నూతన వాటర్ ప్లాంట్ ని స్థానిక అధికారులతో నాయకులు తో కలిసి సందర్శించి వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. క్యూలైన్‌లో ఉన్నటువంటి చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఐసిడిఎస్ సిబ్బందికి సూచించారు. భక్తులకు ఎటువంటి నీటి సమస్య లేకుండా త్రాగునీరు, ఇతర అవసరాలకు నీటిని సరైన సమయంలో అందించాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలనే దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మరింత జాగ్రత్తగా చూడాలని అధికారులందరితో సమావేశాన్ని నిర్వహించి గ్రామంలోనూ, ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, డిఎస్పీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, తహసీల్దార్, ఈవో శోభారాణి, ఇతర అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, గూగూడు సర్పంచ్ రమణమ్మ, సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మిద్దెల నరసింహులు, రైల్వే బోర్డు మెంబెర్ శివ ప్రసాద్, మాజీ సర్పంచ్ రామాంజినేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రాప్తాడులో అన్న క్యాంటీన్‌కు భూమి పూజ



**రాప్తాడు - సూర్య వాస్తవం, జులై 4:** రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు తొలి అడుగు పడిందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.రాప్తాడు మండల కేంద్రంలోని పాత హాస్పిటల్ దగ్గర అన్న క్యాంటీన్ కు భూమి పూజ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో అన్న క్యాంటీన్లకు తొలి అడుగు పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అప్పట్లో ఛత్తీష్ ఘడ్ చెన్నై ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంటీన్లను పరిశీలించామన్నారు. ఛత్తీష్ ఘడ్ లో క్యాంటీన్లు కంటే చెన్నై ప్రాంతంలో ఏర్పాటు చేసిన అమ్మ క్యాంటీన్లు ఎంతో బాగున్నాయన్నారు. అక్కడ భోజనం రుచితో పాటు పూర్తి పరిశుభ్రమైన వాతావరణంలో క్యాంటీన్లు ఉన్నాయన్నారు. తాము అందించిన రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరిన వెంటనే మంజూరు చేశారన్నారు.ఇక్కడ జాతీయ రహదారికి ఆనుకుని అందరికీ కనిపించేలా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నాము. రాప్తాడుకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కూలీలతో పాటు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాళ్లకు కూడా క్యాంటీన్ ఉపయోగపడుతుంది.ప్రతి రోజు ఒక పూటకు 3 వందల మందికి పైగా రూ.5 ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం అందిస్తామన్నారు.ఎవరైనా తమ పుట్టిన రోజులు పెళ్లి రోజులు ఇతర శుభకార్యాల సమయంలో ఇక్కడ భోజనం పెట్టిస్తే బాగుంటుంది. ఇందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మూడు నెలల్లోపు అన్న క్యాంటీన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అయితే రెండు నెలల్లోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయ్ కుమారి ఎంపీడీవో విజయలక్ష్మి సెక్రెటరీ ప్రేమ్ కుమార్ మండల కన్వీనర్ పంపు కొండప్ప కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు సర్పంచ్ సాకే తిరుపాలు మాజీ కన్వీనర్ నారాయణస్వామి మరూరు గోపాలు నంబూరి నాగరాజు ప్రభుత్వ అధికారులు సచివాలయ సిబ్బంది టిడిపి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


# డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా రైళ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 4:** రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు... జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు కోయంబత్తూర్ నుండీ అనంతపురం మీదుగా ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో స్థానిక, జిఆర్‌పి, ఆర్పీఎఫ్, ఈగల్ సెల్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనంతపురం నుండీ గుంతకల్లు వరకు నిన్న రాత్రి రన్నింగ్ ట్రైన్‌లో సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కల్గకుండా సోదాలు కొనసాగాయి. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా పోలీసులు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో సుశిక్షణ పొందిన షైనీ జాగిలం ద్వారా డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరుగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమానితుల లగేజీలు, టాయిలెట్స్, బర్త్ కింద భాగాలను లోతుగా చెక్ చేశారు. యువతను మాదకద్రవ్యాల నుంచి రక్షించటం, రైల్వే మార్గం ద్వారా జరిగే డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో జిల్లా ఈగల్ సెల్ ఆర్ఎస్ఐ హనుమంతు, త్రీటౌన్, ఆర్పీఎఫ్ ఎస్సైలు వెంకటరమణ, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




## దగ్గుపాటి ఫౌండేషన్ తరపున
# 25 కుటుంబాలను దత్తత తీసుకున్న అశ్రిత

- మార్గదర్శిగా నిలిచిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి కుమార్తె దగ్గుపాటి అశ్రిత
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి సమావేశం
- పీ4 చైర్మన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో సమావేశం
- 5651 కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రణాళిక
- విద్యాసంస్థలు, వ్యాపార వర్గాల వారు ముందుకు రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు



**అనంతపురంక్రైం – సూర్య వాస్తవం, జూలై 4:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పి4 కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేందుకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుమార్తె దగ్గుపాటి ఆశ్రిత ముందుకొచ్చారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జూమ్ ద్వారా అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పి 4 చైర్మన్ దగ్గుపాటి ప్రసాద్ అ ధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ కమి షనర్ బాలస్వామి, ఎమ్మార్వో హరికుమార్, ఎంపీడీవో దివాకర్, డిప్యూటీ కమిషనర్ పావనితో పాటు పీ4బృందం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సందేశాన్ని అంతా విన్నారు. తొలి జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 లోగో ఖరారు చేశారు. పంద్రాగస్టు నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలోనే తాము 25 కుటుంబాలను దత్తత తీసు కుంటున్నట్లు దగ్గుపాటి ఫౌండేషన్ ప్రకటించింది. 25 కుటుంబాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు తాము కృషి చేస్తామని దగ్గుపాటి ఆశ్రిత తెలిపారు. నగర కమిషనర్ బాలస్వామితోపాటు పీ4 బృందం మొత్తం అభినందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం అన్నది దేశంలో ఎక్కడా లేదని... పేద కుటుంబాలను ఉన్నత స్థానాలకు చేర్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమం పై ఎవరు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు.

పీ4ని సమర్థవంతంగా అమలు చేసేం దుకు ప్రత్యేకంగా కమిటీలు వేసుకున్నట్లు చెప్పారు. ము ఖ్యంగా అనంతపురం నగరంలో 5651 కుటుంబాలను గుర్తించామని ఆ కుటుంబాలు అత్యంత నిరుపేద స్థితిలో ఉన్నా యన్నారు. ఈ కుటుంబాలకు చేయూతనిచ్చి ముందుకు నడిపించే విధంగా దాతలు ముందుకు రావాలని పిలు పుని చ్చారు. నగరంలో ఎక్కువగా విద్యాసంస్థలు, ఆస్పత్రులు, పరిశ్రమలు, హెూటళ్లు ఎక్కువగా ఉన్నాయని ఇలాంటి వారు పీ4 కార్యక్రమంలో భాగసా ్వమ్యమై మార్గదర్శిగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పీ4 అంటే కేవలం ఒక కుటుంబానికి ఆర్థిక సాయం చేయడమే కాదని.. ఆ కుటుంబాలకి అన్ని విధా లుగా అండగా ఉండి.. వారు ఉన్నతంగా రాణించే విధంగా సహకారం అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.



# డి.సి.హెచ్.ఎస్ నియామకాల్లో గందరగోళం

- నియామకాలు ఫుల్ రూల్స్ నిల్
- రోస్టర్ సైకిల్ పూర్తి కాకుండానే మొదటి నుండి ప్రారంభం
- జిల్లా సెలక్షన్ కమిటీ పై కోర్టు ను ఆశ్రయించనున్న బాధితులు
- గతంలో ఇదే విషయం పై విచారణ, బయటకు రాని రిపోర్టు




**అనంతపురం వైద్యం –సూర్యవాస్తవం, జూలై 4:** అనంతపురం జిల్లాలో వివాదాస్పదంగా మారిన జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయంలో నియామకాలు వ్యవహారం నేడు రోస్టర్ పాయింట్లు విధానం లో తప్పిదాలు వున్నట్లు తెలుస్తోంది. ఇతర జిల్లాలో జరిగిన నియామకాల్లో రిజర్వేషన్ రూల్‌కి పూర్తి భిన్నంగా అనంతపురం జిల్లా నియామకాలు జరిగినట్లు ఆధారాలతో బయటపడ్డాయి. ఇతర అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నకూడా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ విషయపై కోర్టులో విచారణ జరిగింది. బాధితులకు న్యాయం జరిగేలా తీర్పు ఉందని. న్యాయ నిపుణులు చెబుతున్నారు.

జిల్లా కలెక్టర్ ఈ విషయం పై తగు చర్యలు తీసుకోవాలని జిల్లాలోని మెడికల్ కళాశాల, వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ఆసుపత్రి, లో జరిగిన నియామకాల రోస్టర్ నిబంధనలు కు విరుద్ధంగా ఇదే జిల్లాలో డి సి హెచ్ ఎస్ ఏ విధంగా నియామకాల చేపట్టారు? దీనికి జిల్లా కలెక్టర్ అనుమతులు ఎలా ఇచ్చారు అని తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని జిల్లాలో ఏ విధంగా నియామకాల చేపట్టారు.అనంత జిల్లాలో వైద్య శాఖలో ఇతర విభాగాల్లో ఎలా జరిగాయో తెలుసుకొని పునః పరిశీలన చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

# "ఆత్మహత్య కాదు.. హత్యే!"

-మృతురాలి తల్లి తండ్రులు మృతదేహంతో
-పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన.
-ఒక మాట.. ఒక ఆరోపణ.. ఓ ప్రాణం!
- నిందల నీడలో ఒక మృత్యువు!

**పెళ్లకూరు–సూర్యా వాస్తవం,జూలై 04:**
పెళ్లకూరు మండల పరిధిలోని పునబాక గ్రామంలో బుధవారం అమాస దుర్గ అనే మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను శ్రీకాళహస్తికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతి లోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.గురువారం ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగానే, గ్రామస్థులు ఆమె మృతి వెనుక కారణాలపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రారంభించారు. దుర్గ స్వయంగా ఆత్మహత్యకు పాల్పడలేదని, గ్రామంలో కొందరు అక్రమ సంబంధం ఆరోపణలతో దాడి చేయడంతో ఆమె మనోవేదనకు గురై పురుగుమందు తాగిందని బంధువులు




పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం మృత దేహంతో మృతురాలి తల్లి, భర్త, బంధువులు కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కొత్తగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనకు సంఘీభావంగా గ్రామానికి చెందిన యాగాని బెన్నీ కూడా పాల్గొన్నాడు. అదే సమయంలో ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు అతనిపై దాడికి దిగారు. బెన్నీ గాయపడ్డాడు. ఈ ఘటనపై మరోవైపు బెన్నీ బంధువులు కూడా ఫిర్యాదు చేశారు.ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐలు ఆదిలక్ష్మి, నాగరాజు, అజయ్‌కుమార్, స్వప్నలు ఇరు వర్గాలను స్టేషన్ ఆవరణం నుంచి పంపించి శాంతి యుత వాతావరణం నెలకొల్పారు. ఎస్ఐ నాగరాజు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

## బుద్ధ విగ్రహంపై
# దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

- భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో నిరసన
- శాంతికి నిలయం బుద్ధ విగ్రహం




**శాంతిపురం– సూర్యవంశం, జూలై 4:** ఆయన తల నరికి పడేసినా పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం మదనపల్లి రూరల్ మండలం అంకి శెట్టిపల్లి సమీపంలో ఉన్న బుద్ధుని కొండలో ప్రపంచ శాంతికి నిలయమైన తథాగతుడు బుద్ధుడి విగ్రహం నరికి పాదాల చెంత పడ వేయడం అత్యంత దారుణమని భారతీయ అంబేద్కర్ సేన నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు శాంతపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే 3సార్లు బుద్ధుని పై దాడి చేయడం వారి నీచ మనస్తత్వానికి నిదర్శనం అన్నారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నప్పటికీ ఇదివరకు అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే ఈ దుర్మార్గానికి పాల్పడిన వ్యక్తులపై కఠినమైనటువంటి చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఇకమీద ఇలా జరగకుండా పటిష్టమైన భద్రత కల్పించాలని భారతీయ అంబేద్కర్ సేన డిమాండ్ చేశారు. వారిపై చర్యలు తీసుకో లేదంటే రాష్ట్రవ్యాప్తంగా భారతీయ అంబేద్కర్ సేన మరియు ప్రజా సంఘాలు అఖిలపక్ష నాయకులుతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యం బాలకృష్ణ, శాంతిపురం మండల ఇన్చార్జి మంజునాథ్, నాగరాజు,ఎల్లప్ప, కుప్పం నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్,నాగభూషణం, బాలకృష్ణ, దళిత సీనియర్ నాయకులు భద్రప్ప, అధ్యక్షులు సింహాద్రి, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

# తులసి మాత అలంకరణలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



**పామిడి –సూర్య వాస్తవం,జులై 4:** పామిడి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారు దేవాలయం ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా తులసి మాత పూజలు చేశారు. వాసవి మాతృ మండలి సభ్యులు ఈ సందర్భంగా పుష్ప అర్చన, భక్తి గీతాలాపన, పల్లకిసేవ, ఉంజల్‌సేవ చేసి మహమంగళ హారతి గావించి తీర్థ ప్రసాదాలు అందించారు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కుప్పం పట్టణంలో నూతన పెన్షన్ల పంపిణీ






**కుప్పం– సూర్య వాస్తవం, జూలై 4 :** కుప్పం పట్టణంలో శుక్రవారం నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించారు. పురపాలక సంఘంలో కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కడ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ సురేష్ బాబులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేశారు. పింఛనుదారులతో మాట్లాడి వారి యోగక్షే మాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం పింఛన్లను పెద్దమొత్తంలో పెంచి అండగా నిలిచిందని లబ్ధిదారులకు వారు వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జాకీర్ మాట్లాడుతూ.. స్వర్గీయ ఎన్.టి.ఆర్. హయాంలో రూ. 35 తో మొదలైన పింఛన్లు ఈనాడు 4 వేల రూపాయలకు చేరిందన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శం అన్నారు. అన్ని కేటగిరీల పెన్షన్లు పెంచింది కూటమి ప్రభుత్వం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పింఛన్ లబ్ధిదారులకు ఒకటో తేదీన వారి ఇళ్ళకు వెళ్లి ఇవ్వటం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుర పాలక సంఘం అధ్యక్షుడు సెల్వరాజ్, కౌన్సిలర్ జాకీర్ అహ్మద్,తదితరులు పాల్గొన్నారు.

# జంతు పరిశోధన నైతికతపై జాతీయ సదస్సు




**మదనపల్లె– సూర్యా వాస్తవం,జూలై 04:** పట్టణం సమీపంలోని సిటీఎం వద్ద గల మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (అటానమస్)లో జంతు పరిశోధనలో నైతిక అంశాలు, సంక్షేమ సాధనలు అనే అంశంపై శుక్రవారం జాతీయస్థాయి సదస్సు ఘనంగా నిర్వహిం చబడింది. దేశవ్యాప్తంగా 323 మంది ప్రతినిధులుఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సదస్సును ప్రిన్సిపాల్‌డాక్టర్ పి.కె .ప్రకాష్ రెడ్డి, సీసీఎస్ఈఏ ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్ టోనీ సంయుక్తంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ చైర్మన్ బి.అమరనాథ్ రెడ్డి మరియు వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ మహతి పాల్గొన్నారు.వారు పరిశోధన నాణ్యతకు నైతికత ప్రధానమని పేర్కొన్నారు. వక్తలుగా డాక్టర్ ఈశ్వర్ టోనీ జంతు సంక్షేమంపై డాక్టర్.సోమశేఖర్ రెడ్డి 3ఆర్ సూత్రాలు, ప్రత్యా మ్నాయ పద్ధతులపై,డాక్టర్ హస్సాన్ సాహెబ్ నైతిక సవాళ్లను ప్రాక్టికల్గా ఎలా ఎదుర్కోవాలో, డాక్టర్ వినోద్ నెల్సన్ మ హతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో లభించే ఆధునిక పరిశోధనా వసతులపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఈ సదస్సు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు జంతు పరిశోధనలో నైతికత మరియు ఉత్తమ ఆచరణలపై అవగాహన కలిగించే వేదికగా నిలిచింది.

# ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మ చాగంటి కోటేశ్వరావు జన్మదిన వేడుకలు



**నాయుడుపేట–సూర్య వాస్తవం, జులై 04:** తిరుపతి జిల్లా నాయుడుపేట లో చాగంటి సత్సంగం కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మ చాగంటి కోటేశ్వరావు జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయన ప్రవచనాల్ని ప్రజలు మేల్కొనే విధంగా ఉంటాయని మల్లికార్జునరావు వివరించారు. పింగళి వెంకయ్య,అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానందవంటి మహనీయులు రోజు చాగంటి పుట్టడం అదృష్టమని టిడిపి అవధానం సుధీర్ కొనియాడారు. చాగంటి కోటేశ్వరావు ఆధ్యాత్మిక ఆదర్శ వాదులను ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు కిషోర్ అభిప్రాయపడ్డారు అనంతరం మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోబాబురెడ్డి, రాజేష్, సూర్య, కిరణ్, సురేష్ స్వామి, కొప్పాల సుబ్రహ్మణ్యం, అంకయ్య, శశి, పాల్గొన్నారు.

# ఏపిలో జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు



రాయచోటి–సూర్య వాస్తవం, జూలై 4:జర్నలిస్ట్ లకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రెవిన్యూ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు ఈ విషయాన్ని ప్రకటించారు. ఇందు కోసం ముగ్గురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిమంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసుపార్ధ సారధి, నారాయణలతో ఉప సంఘం ఏర్పాటు చేయడం జరిగింది.త్వరలో ఉప సంఘం భేటీ కానుంది. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మంచి రోజులు వచ్చినట్లే అని పలువురు జర్నలిస్టులు ఈ కబురు విని హర్షం వ్యక్తం చేశారు.

# రైతులతో ముఖాముఖీ

## - కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే, అధికారులు




**గుత్తి–సూర్య వాస్తవం,జులై 4 :** గుత్తి అనంతపురం జిల్లా గుంత కల్లు నియో జకవర్గం గుత్తి మండలం బేతాపల్లి గ్రామరో రెన్యూ ప్రాజెక్టుకు సంబంధించి రైతులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వ హించారు.ఈ కార్యక్రమంలోని యోజకవర్గ శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు యువ నేత పామిడి,గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, గుంతకల్ ఆర్డీఓ శ్రీనివాసులు,గు త్తి ఎంపీడీఓ,గుత్తి తహసిల్దార్ పా ల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మె ల్యే గుమ్మనూరు జయరాం మా ట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఐటీ,వి ద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రయత్నాలతో బేతాపల్లి గ్రామాని కి రెన్యూ పేరుతో భారీ ప్రాజెక్టు రా బోతోంది.ఈ ప్రాజెక్టు ప్రారంభమై తే చుట్టుపక్కల గ్రామాల యువ తకు ఉపాధి అవకాశాలు లభిస్తా యి.భవిష్యత్తు మెరుగవుతుంది రైతులు స్వచ్ఛందంగా భూము లు ఇవ్వాలి.ఇప్పటికి మీ సంకో చం వల్ల మన పిల్లల రేపటి జీవి తం ప్రమాదంలో పడుతుంది.అ న్నారు ప్రాజెక్టుపై ప్రజల్లో అపోహ లు కలిగించే వారికి హెచ్చరికలు జారీ చేస్తూ,ఏదైనా మీకు అను మానం ఉంటే ఆధారాలతో మా ట్లాడాలి.రైతులకు మేలు చేసే ప నుల్లో అడ్డుపడితే తగిన రీతిలో తాటతీస్తాను.ఎవరైనా రైతులను బెదిరించినా భయపెట్టినా వారికి అండగా ఉంటాను,నేను మీ ఆర్థి కంగా ఎలా లాభపడుతారు అం టూ ఇలా చెప్పు కొచ్చారు.ఒక ఎ కరాలు వేరుశనగ పంట వేస్తే,సం వత్సరానికి మీరు 7 క్వింటాలు పండిస్తే మార్కెట్ ధర క్వింటాంకు 6 వేలు అనుకొన్నా 7 లి6=42 వే ల రూపాయలు,గొర్రు,గుంటక పాయడానికి,విత్తనాలకు ఎకరాకు1 5 వేల రూపాయలు ఖర్చు,సేద్యం చేయడానికి 10 వేలరూపాయ లు ఖర్చు,ఎరువులు,పురుగు మందులు,పంట మిషను ఆడిం చడం వంటి వాటి ఖర్చులు తీసి వేస్తే రైతుకు మిగిలేది కేవలం 5 వే లు లేదా 10 వేలు ఉంటుంది.ఒక రైతు సంవత్సరం అంతా కష్టపడి తే రైతుకు మిగిలేది ఇంతే.మరి రె న్యూ కంపెనీ వారు మీ భూముల కు ఎకరాకు 35 వేలరూపాయలు ఇస్తుంది.మీరు కష్టపడకుండా 35 వేల రూపాయలు సంపాదించడం మేలు కదా అని సభాముఖంగా ఎమ్మెల్యే జయరాం బేతాపల్లి రై తులను ప్రశ్నించారు.ఎవరో ఆధా రాలు లేని ఆరోపణలు చేస్తే అవి విని అనుమానం పెట్టుకోవద్దని బేతాపల్లి గ్రామ రైతులకు అని స్ప ష్టం చేశారు.కార్యక్రమంలో గుంత కల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాం,ఆయన కుమారుడు గుమ్మ నూరు ఈశ్వర్,గుంతకల్ ఆర్డీఓ శ్రీనివాసులు,గుత్తి ఎంపీడీఓ గు త్తి తహసిల్దార్,గ్రామ ప్రజలు నా యకులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు.

# నిమ్మనపల్లి మండల అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ ముఖ్య నేతల అభిప్రాయ సేకరణ

## - పార్టీ లో వారి పనితీరు ఆధారంగా పేరు ప్రకటిస్తాం
## - మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులు గురుమూర్తి వెల్లడి



**మదనపల్లి –సూర్య వాస్తవం, జులై 4:** మదనపల్లి పట్టణం ఎన్విఆర్ కళ్యాణ మండపంలో నిమ్మనపల్లి మండలం తెలుగుదేశం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మదనపల్లి నియోజ కవర్గ పరిశీలకులు గురుమూర్తి, సురేష్, అబ్సర్వర్లు, మండలానికి సంబం ధించిన పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఇందులో భాగంగా మండల అధ్యక్షుని పేరును మండలానికి సంబంధించిన నాయకులను అడిగి వారి అభిప్రాయాన్ని తెలుసు కున్నారు. పార్టీ లో వారి పనితీరును, తెలుగుదేశం పార్టీ విజయానికి వారు అందించిన సేవలను, పార్టీ లో వారి పాత్ర తీరును గుర్తించి అధ్యక్ష పదవిని అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పందిస్తూ పార్టీలో గ్రూపులంటూ ఏవీ లేవని, ఉన్నది ఒకే ఒక గ్రూపు అది నారా చంద్రబాబు నాయుడు గ్రూప్ మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మనపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.



### తోతపూరి మామిడి రైతులను అన్ని విధాల

# అండగా నిలచిన కూటమి ప్రభుత్వం

## - టిడిపి రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి



**రాయచోటి–సూర్య వాస్తవం, జులై 4:**మ్యాంగో పల్ప్ పై 12 శాతం జీఎస్టీ ని, పండ్ల రసాలపై 12 శాతం ఉన్న జీఎస్టీ ని ఐదు శాతానికి తగ్గించాలని కేంద్రానికి లేఖ రాసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని మామిడి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో టిడిపి రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోలమల ఖాదర్ వల్లి మాట్లాడుతూ...గత ఐదు సంవత్సరాలుగా మామిడి రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించలేని జగన్ సర్కార్ ఈ సందర్భంగా తప్పుపట్టాడు.చిత్తూరు లో ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తోసి తమ సొంత ఫ్యాక్టరీలకు కిలో 3 రూపాయలు కొనుగోలు చేసి మామిడి రైతులను నిండా ముంచిన కుటుంబం పెద్దిరెడ్డి కుటుంబమే అంటూ ఆయన ఆరోపించారు.మామిడి రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచిందంటూ తప్పుడు ప్రచారాలు చేస్తూ రైతులను కలవడానికి బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మామిడి రైతులతో కూటమి శ్రేణులు కలయతిరిగారు.కష్టకాలంలో ఉన్న మామిడి రైతులకు కోత దశలోనే తోతాపూరి రకానికి టన్నుకు 12 వేల రూపాయల మద్దతు ధర ప్రకటించడంతో మామిడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టిడిపి నాయకులు, రాయచోటి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు రూ.8 వేల మరో నాలుగు వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని ఆయన తెలిపారు. ఇబ్బందులకు గురవుతున్న మామిడి రైతులకు ప్రభుత్వం 4 రూపాయలు సబ్సిడీ రూపంలో అందజేస్తుందని తెలిపారు.గత ఐదు సంవత్సరాలుగా మామిడి రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించలేని వైసిపి ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తూ మామిడి రైతుల వద్ద తిరగడం హాస్యాస్పదంగా ఉందన్నారు.చిత్తూరు లో ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తోసి తమ సొంత ఫ్యాక్టరీలకు కిలో 3 రూ...కొనుగోలు చేసి మామిడి రైతులను నిండా ముంచిన కుటుంబం పెద్దిరెడ్డి కుటుంబంకాదా అని ఆయన ప్రశ్నించారు. మద్దతు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఆత్మహత్యే శరణ్యం అన్న సమయంలో సబ్సిడి అందజేసిన కూటమి ప్రభుత్వం యొక్క రుణం తీర్చుకోలేమని రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని బోనమల ఖాదర్ వలి తెలిపారు.

### ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను

# ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

## - ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న పదోన్నతులు వెంటనే ఇవ్వాలి
## - ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్వి కుమార్ డిమాండ్



**మదనపల్లి –సూర్య వాస్తవం, జులై 4:**

గత ఆరేళ్లుగా పెండింగ్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకుపదోన్నతులు వెంటనే కల్పించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీనే సొంతంగా కొనుగోలు చేయాలని ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్వికుమార్, ఏఐటీయూసీ మదనపల్లి నియోజకవర్గం కార్యదర్శి షేక్ ముబారక్‌లు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు శుక్రవారం మాట్లాడుతూ... పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా 3 కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలని, విలీనానికి ముందున్న ఇన్సెంటివ్ స్కీమ్స్ అన్ని యధావిధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ అయ్యే ఉద్యోగులకు విలీణానికి ముందు ఉండే ఆర్ఇఎంఎస్ స్కీం వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత ప్రయాణం స్కీం సక్సెస్ కావాలంటే వెంటనే కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టి, ఇబ్బందులను వెంటనే తొలగించా లన్నారు. ట్రెజరీ అడ్డంకులతో ప్రతినెల ఆర్టీసీ మేనేజ్మెంట్ 20 వేల రూపాయలు జీతం చెల్లిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ కానిస్టేబుల్స్, జూనియర్ అసిస్టెంట్లు మొత్తం 35 మందికి ప్రభుత్వమే జీతాలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని, ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను అప్కాస్‌లో చేర్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీలో నిబంధనల మేరకు నియా మకంజరిగి అన్ని అర్హతలు ఉన్నా సరే రెగ్యులర్ కాని కాంట్రాక్ట్ డ్రైవర్లు, కండక్టర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని, మెడికల్ అన్ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు, విధుల్లో ఉండి చని పోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని, అన్ని వర్క్ షాప్ లలో కేంద్ర కేంద్ర కార్యాలయం ఇచ్చిన సర్కిలర్ ప్రకారం 100 పిఎల్ మాత్రమే చేయుటకు అనుమతించాలని కోరారు. 125 పిఎల్ 150 పి.ఎల్ చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి చేసే విధానాలు మానుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చరించారు. ఇందులో దాదాపుగా 32 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచామని, ఈ డిమాండ్లన్నీ పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమలప్ప, వన్ డిపో సెక్రటరీ ఈశ్వరప్ప, టు డిపో సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ బి మధు, ప్రెసిడెంట్ మధు, యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టినరోజు వేడుకలు

## - రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ
## - విద్యార్థుల కు యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణి



**మదనపల్లి –సూర్య వాస్తవం, జులై 4:** చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరువు కున్నారు. శుక్రవారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ కవితా రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పుష్ప గుచ్ఛాలతో అధ్యక్షులకు స్వాగతం పలికారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అనే మహావృక్షాన్ని స్థాపించిన ఎంపీ ఆనందన్ మానవతా దృక్పథంతో, అంచలంచెలుగా ఆలోచన వెలుగైతే ఆచరణై వెలిగించు అనే ఆశయంతో 2002లో సంస్థ ను స్థాపించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వైద్యం ఆరోగ్యం పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తు 2009 జనవరి 17న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ పునరావేశ కేంద్రం ద్వారా ఐదు మంది పిల్లలతో మొదలైన ఈ ప్రస్థానం నేడు 460 మంది పిల్లలు బయటికి వెళ్లి స్వయం కృషితో జీవిస్తున్నారు. పదిమంది ఆడపిల్లలకు వివాహం జరిపించి పుట్టినిల్లు సారెను అందిస్తున్నారు. 2016లో ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ద్వారా వీధి బాలలు, నిరాధారణ గురైన పిల్లలకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నారు. 2020లో ఆనంద వృద్ధాశ్రమం ద్వారా అలసిన వృద్ధులను చేరదీసి వారి ఆలనా పాలన చూసి తదనంతరం వారికి చివరి మజిలీ వీడ్కోలు కూడా పలుకు తున్నారు.

ఈనాడు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో వంద మంది విద్యార్థులు 10 మంది వృద్ధులు పలువురు ఉపాధ్యాయ బృందానికి, ఉపాధ్యాయేత బృందానికి వృద్ధాశ్రమ సిబ్బందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థ రధ సారధి కి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. సంస్థ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి వి ఎస్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ కృష్ణ చరణ్, ట్రెజరర్ పట్నం గిరిజమాల్, ఉపాధ్యాయుల బృందం సిబ్బంది, విద్యార్థులు ప్రతి ఒక్కరూ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంపీ ఆనందన్ తో తమకు వున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు.

అనంతరం ఎంపి ఆనందన్ పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు, సిబ్బందికి, వృద్ధులకు, పిల్లలతో కలసి కేక్‌కట్ చేసి వారితో సంతోషాన్ని పంచు కున్నారు. ఈ కార్యక్రమంలో ముత్తు అంగ్లమాదిగ పాఠశాల సిబ్బంది,పిల్లలు ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.



# సరికొత్త పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ సరికొత్త పాత్ర పోషించబోతున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలు ఆయన చేసుకుంటూ వెళుతున్నారు. చాలావరకూ బ్లాక్‌బస్టర్ హిట్లు అందుకుంటున్నాయి. 2021లో విడుదలైన 'అఖండ' సినిమా నుంచి ఆయన కెరీర్ మళ్లీ ఊపందుకుంది. అఖండ తర్వాత వచ్చిన 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', డాకు మహారాజ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. తాజాగా 'అఖండ 2' సినిమాలో నటిస్తున్నారు. తన అభిమానులను ఆశ్చర్చపరిచే విధంగా బాలకృష్ణ కామెడీ రోల్‌లో నటించబోతున్నారు. ఇటీవలే ప్రకటించబడిన 'ఈ నగరానికి ఏమైంది 2' సినిమాలో బాలకృష్ణ ఓ గెస్ట్‌రోల్‌లో చేస్తున్నారని టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది.

## 'హరిహర వీరమల్లు'
# ట్రైలర్‌కు 4.7 కోట్ల వ్యూస్

పవన్ కళ్యాణ్ నుంచి చాలా కాలం తర్వాత వస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. దర్శకులు జ్యోతి కృష్ణ, క్రిష్ ఈ సినిమాను తెరకెక్కించారు. గురువారం నాడు ట్రైలర్‌ని థియేటర్లలో విడుదల చేయడంతో మంచి బజ్‌ని సొంతం చేసుకుంది. ఆన్‌లైన్‌లో కూడా రికార్డు రెస్పాన్స్‌ని ఈ ట్రైలర్ సొంతం చేసుకుంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్ కేవలం 24 గంటల్లోనే 4 కోట్ల 70 లక్షలకు పైగా వ్యూస్ ని దక్కించుకుంది. ఆల్‌టైం రికార్డుగా పాన్ ఇండియా సెన్సేషనల్ సీక్వెల్ పుష్ప 2 ట్రైలర్ 4.4 కోట్లకు పైగా వ్యూస్‌తో ఉంది.



# సెకండ్ షెడ్యూల్‌కి 'ఎన్‌సి-24'



నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో 'ఎన్‌సి-24' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ మిథికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో చైతన్య మునుపెన్నడూ చేయని డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ సెకండ్ షెడ్యూల్ స్టార్ట్ అయినట్లు చిత్ర బృందం ప్రకటించింది.

ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. 'ఒక అడుగు ముందుకు మరో అడుగు దగ్గరగా.. రెండో షెడ్యూల్ మొదలైంది' అనే క్యాప్షన్ జోడించారు.

# అరుదైన గౌరవం






బాలీవుడ్ నటి దీపికా పదుకొణెకు 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్' అవార్డు లభించింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమెను హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎంపిక చేసింది. ఈ అవార్డుతో దీపికా పేరు హాలీవుడ్ బులేవార్డ్‌పై ఏర్పాటు చేయనున్న స్టార్ ప్లేట్‌పై కనిపించనుంది.

ఇది ఒక ప్రముఖ గుర్తింపు మాత్రమే కాకుండా, ప్రపంచ సినీ రంగంలో భారతీయ నటీనటుల ప్రతిభను గుర్తించిన చారిత్రాత్మక ఘట్టం. ఇంతవరకూ బాలీవుడ్ నుంచి అగ్రతారలు అయిన షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్ వంటి నటులు కూడా ఈ జాబితాలో స్థానం పొందలేదు. దీపిక ఆ ఘనతను సాధించి, తొలిసారిగా ఈ గౌరవాన్ని అందుకున్న భారతీయ నటిగా రికార్డ్ సృష్టించారు. 2026లో 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్' కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో దీపికా పేరుతో ఏర్పాటు చేయబోయే ప్రత్యేక కార్యక్రమానికి బాలీవుడ్ సెలబ్రిటీలతో పాటు హాలీవుడ్ ప్రముఖులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.



# ఇంగ్లండ్‌ను కూల్చిన సిరాజ్

## -ఆరు వికెట్లతో సత్తా చాటిన హైదరాబాదీ పేసర్
## - బ్రూక్, స్మిత్ భారీ శతకాలు - 244పరుగుల ఆధిక్యతలో భారత్

**బర్మింగ్‌హామ్:** రెండోటెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. మూడోరోజు ఆటలో భాగంగా తొలి రెండు సెషన్లలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించగా.. టీ విరామం తర్వాత భారత బౌలర్లు చెలరేగారు. ముఖ్యంగా హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ లోయర్ ఆర్డర్‌లో ముగ్గురిని డకౌట్ చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. దీంతో భారతజట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 180పరుగుల ఆధిక్యత లభించింది. తొలిసెషన్‌లో వరుసగా రెండు వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు.. తర్వాత ఆ పట్టును నిలుపుకోలేకపోయారు. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 77పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ బ్యాటర్ రూట్(22), కెప్టెన్ బెన్ స్టోక్స్(0) వికెట్లను మహ్మద్ సిరాజ్ పడగొట్టాడు. రెండు వరుస బంతుల్లో వీరిద్దరినీ ఔట్ చేశాడు. ఆ సమయానికి ఇంగ్లండ్ జట్టు 84/5 పరుగులుగా ఉంది. ఆ తర్వాత యువ ఆటగాళు బ్రూక్, వికెట్ కీపర్ స్మిత్ భారీ శతకాలతో కదం తొక్కి.. ఆరో వికెట్‌కు 303 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇంగ్లండ్ స్కోర్ 387పరుగులకు బ్రూక్ ఔటయ్యాడు. తొలి సెషన్ భారత బౌలర్లు ఆరంభంలోనే విరుచుకుపడి ఇంగ్లండ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చినప్పటికీ, అసాధారణ పోరాటంతో బ్రూక్-స్మిత్ జట్టును ఆదుకున్నారు. భారత తొలి ఇన్నింగ్స్ భారీ స్కోరుకు దీటుగా బదులిస్తూ, తమ జట్టును పటిష్ట స్థితిలో నిలిపారు. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో%8%% తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఒకానొక దశలో 84 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆరో వికెట్‌కు హ్యారీ బ్రూక్-జేమీ స్మిత్ అద్భుతంగా పోరాడారు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి, అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా స్మిత్ కేవలం 169 బంతుల్లోనే 19 ఫోర్లు, 3 సిక్సర్లతో 157 పరుగులు సాధించడం విశేషం. బ్రూక్ కూడా నిలకడగా ఆడి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీ విరామానికి ఇంగ్లండ్ 5 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ సమయానికి ఇంగ్లండ్ జట్టు భారత్ స్కోరుకు ఇంకా 232 పరుగులు వెనుకబడి ఉంది. టీ విరామం తర్వాత కొత్త బంతి అందుకున్న ఆకాశ్ దీప్ తొలి బ్రేక్ ఇచ్చాడు. బ్రూక్(158)ను బౌల్డ్ చేశాడు. దీంతో భారత ఫీల్డర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయానికి ఇంగ్లండ్ 184ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 392పరుగులు చేసింది. ఆ తర్వాత మహ్మద్ సిరాజ్ లోయర్ ఆర్డర్



బ్యాటర్లు కర్సే, టంగ్, బషీర్‌లను డకౌట్ చేయడంలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 407పరుగుల వద్ద ముగిసింది. సిరాజ్(6/70), ఆకాశ్ దీప్(4/88) బౌలింగ్‌లో మెరిసారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారతజట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. జైస్వాల్(24) పెవీలియన్‌కు చేరగా.. కెఎల్ రాహుల్(28), కరణ్ నాయర్(1) క్రీజ్‌లో ఉన్నారు. భారత్ 244 పరుగుల ఆధిక్యతలో ఉంది.

స్కోర్‌బోర్డు

**ఇండియా తొలి ఇన్నింగ్స్: 587పరుగులు**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరణ్ నాయర్ (బి)సిరాజ్ 19, డకెట్ (సి)శుభ్‌మన్ (బి)ఆకాశ్‌దీప్ 0, పోప్ (సి)రాహుల్ (బి)ఆకాశ్‌దీప్ 0, రూట్ (సి)పంత్ (బి)సిరాజ్ 22, బ్రూక్ (బి)ఆకాశ్‌దీప్ 158, స్టోక్స్ (సి)పంత్ (బి)సిరాజ్ 0, జామీ స్మిత్ (నాటౌట్) 184, వోక్స్ (సి)కరణ్ నాయర్ (బి)ఆకాశ్ దీప్ 5, కర్సే (ఎల్‌బి)సిరాజ్ 0, టంగ్ (ఎల్‌బి)సిరాజ్ 0, బషీర్ (బి)సిరాజ్ 0, అదనం 19. (89.3ఓవర్లలో ఆలౌట్) 407 పరుగులు. వికెట్ల పతనం: 1/13, 2/13, 3/25, 4/84, 5/84, 6/387, 7/395, 8/396, 9/407, 10/407 బౌలింగ్: ఆకాశ్‌దీప్ 20-2-88-4, సిరాజ్ 19.3-3-70-6, ప్రసిధ్ కృష్ణ 13-1-72-0, నితీశ్ 6-0-29-0, జడేజా 17-2-70-0, సుందర్ 14-0-73-0.

## ఆ క్యాచ్‌ను అందుకోవడంతో
## నా ఆత్మవిశ్వాసం పెరిగింది : శుభ్ మన్ గిల్



**క్రీడలు :** ఫీల్డింగ్‌లోనూ క్యాచ్‌ను అందుకోవడంతో నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది అని భారత సారథి శుభ్ మన్ గిల్ అన్నారు.ఇంగ్లాండ్‌పై డబుల్ సెంచరీ (269) చేసిన భారత కెప్టెన్ శుభమన్ గిల్ దాదాపు 65 ఓవర్లపాటు బ్యాటింగ్ చేశారు. తొలిరోజు నుంచి రెండో రోజు మూడో సెషన్ ప్రారంభం వరకూ క్రీజ్‌లోనే గడిపారు. ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు దిగిన తర్వాత రెండో ఓవర్‌లో గిల్ మైదానంలోకి వచ్చారు. ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో ఓపెనర్ బెన్ డకెట్ ఇచ్చిన క్యాచ్‌ను గిల్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. తొలి టెస్టులో భారత ఫీల్డర్లు ఆరేడు క్యాచ్‌లను వదిలేసిన సంగతి తెలిసిందే. ఈసారి మాత్రం మూడు క్యాచ్‌లను సూపర్‌గా పట్టారు. రెండోరోజు మ్యాచ్ ముగిసిన అనంతరం గిల్ ఫీల్డింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. " గత కొన్ని రోజులుగా నేను స్లిప్‌లో క్యాచ్‌లను ప్రాక్టీస్ కూడా చేయలేదు. ఈ టెస్టు మొదలైన తర్వాత బ్యాటింగ్ కోసం క్రీజ్‌లోనే ఉండిపోయా. మూడో ఓవర్‌లోనే క్యాచ్ పట్టడం భలేగా అనిపించింది. ఫీల్డింగ్ ఎంత ముఖ్యమో మాకు తెలుసు. దీనిపై మేం సుదీర్ఘంగా చర్చిం చుకున్నాం. గత మ్యాచ్‌లో మేం సగం మాత్రమే నాణ్యమైన ప్రదర్శన చేశాం. కొన్ని క్యాచ్‌లను వదిలేయడం చాలా నష్టం చేసింది. లేకపోతే పరిస్థితి భిన్నంగా ఉండేది " అని గిల్ వెల్లడించారు." టెస్టుల్లో సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడాలంటే మాత్రం చాలా కఅషి చేయాలి. ఈ సిరీస్‌కు ముందునుంచే నేను దానిపై సాధన చేశా. ఐపీఎల్ ముగింపు నుంచే దృష్టిసారించా. టెస్టు క్రికెట్ ఆడేముందు అది చాలా అవసరం. ఇప్పటివరకు నా కష్టానికి సరైన ఫలితమే వచ్చింద నుకుంటున్నా. మున్ముందు ఇదే తరహాలో ఆడేందుకు ప్రయత్నిస్తూనే ఉంటా. ఫీల్డింగ్‌లోనూ క్యాచ్‌ను అందుకోవడంతో నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది" అని భారత సారథి వ్యాఖ్యానించారు.

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ 587 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 77 పరుగులకే మూడు వికెట్లను కోల్పోయింది. ఇందులో స్లిప్‌లోనూ మూడు క్యాచ్‌లను పట్టుకోవడం విశేషం. గిల్, కరుణ్ నాయర్ ఏమాత్రం ఇబ్బందిపడకుండా అందుకోగా, కేఎల్ రాహుల్ కాస్త ఇబ్బందిపడినట్లు అనిపించినా రెండో ప్రయత్నంలో పట్టేశాడు. ఇందులో రెండు వికెట్లు ఆకాశ్‌దీప్ తీయగా.. సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )